
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 29.0
కనిష్ఠం 21.4
ANDHRAJYOTHY




నల్లగొండ
5
సోమవారం 3 నవంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.60 (310.8498)	72,151	72,151
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.70 (4.12)	6,527.50	6,527.50
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	171.881 (41.0529)	69,213	1,11,512

చికెన్ ధరలు	లైవ్ : రూ.149	డ్రెస్ : రూ.230	స్కిన్‌లెస్ : రూ.260

పనుల పునరుద్ధరణకు సర్వే



- నేడు ఎస్‌ఎల్‌బీసీ ఎలెక్ట్రో మాగ్నెటిక్ హెలిబోర్న్ సర్వే ప్రారంభం
- నాగర్‌కర్నూల్ జిల్లా మన్నెవారిపల్లి నుంచి మొదలు
- పర్యవేక్షణకు సీఎం రేవంత్, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి

నల్లగొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ప్రతిష్ఠాత్మకంగా భావించే ఎస్‌ఎల్‌బీసీ సొరంగమార్గం పనుల పునరుద్ధరణ నిమిత్తం చేపడుతున్న ఎలెక్ట్రో మాగ్నెటిక్ హెలిబోర్న్ సర్వే నేటి నుంచి ప్రారంభం కానుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈ సర్వేను లాంఛనంగా ప్రారంభించనున్నారు. హైదరాబాద్ నుంచి సర్వే నిర్వహించే హెలికాప్టర్ తో పాటు ముఖ్యమంత్రి, మంత్రులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు మరో హెలికాప్టర్‌లో అవుట్‌లెట్ సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుని, ఈ హెలిబోర్న్ సర్వేను ప్రారంభించి పర్యవేక్షించనున్నారు.

2028జూన్‌లోగా పనులు పూర్తి చేసేలా..

శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి మన్నెవారిపల్లి వరకు 43.93 కిలోమీటర్ల సొరంగమార్గం పనులను 2007నుంచి చేపట్టగా, పలు అవాంతరాల నడుమ 2009 వరకు 34.13 కిలోమీటర్ల సొరంగం పూర్తయింది. 2009 వరదల సమయంలో ఇన్‌లెట్ వైపు పనులకు వరదనీరు, శకలాలు కూలడం వంటి ఆటంకాలతో పనులను ఆటంకం కలిగితే, ఔట్ లెట్ వైపు టీబీఎం యంత్రంలో బేరింగ్ పగిలిపోయి పనులు నిలిచాయి. అప్పటినుంచి ఆగిన పనులను తిరిగి ఈ ఏడాది ఫిబ్రవరి 22వ తేదీన పునఃప్రారంభించగా, మర్నాడు 23వ తేదీన ఇన్‌లెట్ వైపు పనులు జరిగే చోట కొండచరియలు విరిగిపడి ప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో ఎనిమిది మంది చనిపోగా, పనులు ఆగిపోయాయి. నిపుణుల కమిటీల నివేదికల అనంతరం ఇక్కడ బ్యాలెన్స్ సొరంగమార్గం పనులను అత్యాధునిక సాంకేతిక విధానం అవలంబించి వేగవంతంగా 2028 జూన్‌లోగా పూర్తి చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా పనులకు ఉపయోగించే సాంకేతికత నిమిత్తం నేషనల్ జియో ఫిషికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సూచనలు తీసుకున్నారు. ఈ సంస్థ సూచనలతో పాటు రక్షణశాఖలో పనిచేసిన మాజీ ఈఎన్సీ లెఫ్టినెంట్ జనరల్ హరిపాల్‌సింగ్‌ను ఈ సొరంగ పనుల పర్యవేక్షణ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక సలహాదారులుగా నియమించింది. ప్రఖ్యాత టన్నెల్ స్పెషలిస్ట్ పరీక్షిత్‌మెహ్రాను ఏడాది పాటు ప్రత్యేక అధికారిగా నియమించా రు. వీరి సూచనలు, నిపుణుల కమిటీ సిఫారసుల మేరకు ఇక్కడ పనులు నిర్వహించే నిమిత్తం ఎలెక్ట్రో మాగ్నెట్ హెలిబోర్న్ సర్వే చేపట్టాలని నిర్ణయించారు. ఈ సర్వే పనులను సోమవారం ప్రారంభించనున్నారు. ఈ సర్వేలో 200 మీటర్ల ఎత్తు నుంచి ప్రత్యేక విద్యుదాయస్కాంత కిరణాల ద్వారా భూగర్భంలో 1000 మీటర్ల లోతు వరకు భూమిలో ఉండే పొరలు, నిర్మాణాలు, జల ప్రవాహాలను గుర్తించనున్నారు. ఈ సొరంగం మార్గంలో మిగిలిన దాదాపు 10 కిలోమీటర్ల పనులు ఎక్కడ ఎలా నిర్వహించాలో నిర్ధారిస్తారు. ఆ సర్వే ఆధారంగా పనులు పునఃప్రారంభించి టీబీఎం బదులు డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ విధానంలో సొరంగం నిర్మిస్తారు...

- మిగతా 8వ పేజీలో...

పురపాలికల్లో ఆఖరి మజిలీకి ఇక్కట్లు తప్పడం లేదు. జిల్లాలో పలు మునిసిపల్ కేంద్రాల్లో చేపట్టిన వైకుంఠధామం నిర్మాణాలు నేటికీ పూర్తికాలేదు. దీంతో పట్టణ ప్రజలు దహన సంస్కారాలు నిర్వహించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
(మిర్యాలగూడ టౌన్, చండూరు)



మిర్యాలగూడలోని మహాప్రస్థానం

ఆంధ్రజ్యోతి విజిట్

ఆఖరి మజిలీకి అవస్థలు

- శ్మశాన వాటికలు.. సమస్యల వేదికలు
- పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాని మహాప్రస్థానం
- బాధ్యత మోస్తున్న కాంట్రాక్టర్:
- ఇతర వాటికలదీ అదే పరిస్థితి

పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా అదనపు వాటికలను నిర్మించాల్సిన పాలకులు అందుబాటులో ఉన్న వాటినే అభివృద్ధి చేయడం లేదు. సుదీర్ఘకాలం అనంతరం అభివృద్ధి చేసిన మహాప్రస్థానానికి బిల్లులు చెల్లించి స్వాధీనం చేసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రణాళికాలేమి కారణంగా శ్మశానవాటికలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. మిర్యాలగూడ పట్టణంలోని షాబూనగర్ హిందూ శ్మశానవాటికను మహాప్రస్థానం పేరుతో అభివృద్ధి చేశారు. 2023లో రూ.5.05కోట్ల వ్యయంతో చేపట్టిన పనులు శరవేగంగా సాగాయి. ఆ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు వచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అప్పటికే 90శాతం పనులు పూర్తి కాగా,



మిర్యాలగూడ మహాప్రస్థానంలో అసంపూర్తిగా ఉన్న పనులు

మహాప్రస్థానంలో ఎలక్ట్రికల్ క్రిమేషన్ యూనిట్, జనరేటర్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాల్సి ఉంది. అందుకు సుమారు రూ.55లక్షలతో అధికారులు ప్రతిపాదలను రూపొందించారు. అయితే అప్పటికే అంచనా వ్యయానికి అదనంగా రూ.70లక్షలు వెచ్చించింది కాంట్రాక్ట్ సంస్థ. సుమారు రూ.5.50కోట్ల బిల్లులు విడుదల కాకపోవడంతో మిగతా పనులు పూర్తికాలేదు.

కాంట్రాక్ట్ సంస్థ నిర్వహణలోనే మహాప్రస్థానం

అత్యాధునికంగా అభివృద్ధి చేసిన మహాప్రస్థానాన్ని మునిసిపాలిటీ స్వాధీనం చేసుకోవాల్సి ఉంది. అయితే నిధులు విడుదలకాకపోవడంతో కాంట్రాక్ట్ సంస్థనే నిర్వహణ బాధ్యత చూస్తోంది. శ్మశాన వాటికలో విధులు నిర్వహించే వాచ్‌మెన్, వర్కర్ల వేతనాల నుంచి మొక్కల పెంపకం వరకు, విద్యుత్ బిల్లుల చెల్లింపుతో కలిపి నెలకు సుమారుగా రూ.లక్ష వెచ్చించాల్సి వస్తోందని కాంట్రాక్టరు వాపోతున్నాడు.

ఇతర వాటికలకు మోక్షమెప్పుడో?

పట్టణంలోని హిందూ శ్మశాన వాటికలు షాబూనగర్(మహాప్రస్థానం), గాంధీనగర్(ఎస్సీ), బాపూజీనగర్, ఈదులగూడ(రాంనగర్‌బందం)లో ఉండగా, వినోబానగర్‌లో క్రిస్టియన్ బరేల్ గ్రౌండ్, బంగారుగడ్డలో ముస్లింల ఖబరస్తాన్ ఉన్నాయి. అయితే ఈ శ్మశాన వాటికల్లో కనీస వసతులు లేవు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న వైకుంఠధామాలు పచ్చదనం, సకల వసతులతో పార్కులను తలపిస్తుండగా, పట్టణంలోని పలు శ్మశాన వాటికలు అభివృద్ధికి నోచుకోకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఇబ్బంది పడుతున్నారు.

కార్యరూపం దాల్చకపోవడానికి కారణాలెన్నో

శ్మశాన వాటికల అభివృద్ధికి అడ్డుపడే కారణాలెన్నో ఉన్నాయి. అందులో స్థల వివాదం ప్రధాన సమస్యగా ఉండగా, నిధుల కొరత ఆ తరువాతది. పట్టణంలోని బాపూజీనగర్ శ్మశాన

- మిగతా 8వ పేజీలో...

శ్మశాన వాటికలను అభివృద్ధి చేస్తున్నాం



నిధుల కొరత కారణంగానే వైకుంఠధామాల అభివృద్ధి, నిర్వహణ సాధ్యం కావడంలేదు. పట్టణ ప్రజల అవసరాలకు అనుగుణంగా శ్మశాన వాటికలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించడంతో పాటు నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతున్నాం. ఆధునిక హంగులతో అభివృద్ధి చేసిన హిందూ శ్మశాన వాటిక మహాప్రస్థానం కాంట్రాక్టరు నిర్వహణలోనే ఉన్న మాట వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. యూఐడీఎఫ్ నిధులతో ఈదులగూడ శ్మశాన వాటికను అభివృద్ధి చేయనున్నాం.
- గణవేణి శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ

యాదవజాతి ఐక్యతకు సదర్
సమ్మేళనం నిదర్శనం

- రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ సభ్యుడు డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు
- వైభవంగా సదర్ సమ్మేళనం
- సదర్‌ను తిలకించి పరవశించిన ప్రజలు



నల్లగొండ, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): యాదవ జాతి సమైక్యతకు సదర్ సమ్మేళనం నిదర్శనమని రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ సభ్యుడు వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. యాదవుల సదర్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో ఆదివారం రాత్రి నిర్వహించిన యాదవుల సదర్ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శ్రీకృష్ణుని చిత్రపటానికి పూజలు నిర్వహించి ఉత్సవాన్ని పారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవులు గోసంపదను పూజించే సంస్కృతిని కొనసాగిస్తున్నామని యావత్ జాతికి తెలియజేసేందుకే ప్రతీ సంవత్సరం వైభవంగా సదర్ సమ్మేళాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం యాదవుల సదర్ సమ్మేళనం పండుగను అధికారికంగా నిర్వహించడం హర్షనీయమని పేర్కొన్నారు. ఈ సదర్ పండుగ యాదవుల ఖదర్‌ను నిలబెడుతుందన్నారు. యాదవులంతా ఒకే తాటిపైకి వచ్చి ఐక్యతను చాటారన్నారు. అంతకుముందే పట్టణంలోని గాంధీనగర్ యాదవసంఘం భవనం, మర్రిగూడ రేణుకాఎల్లమ్మ దేవాలయం, పాతబస్తీ యాదవ సంఘం ఆవరణలో హర్యానా, హైదరాబాద్ నుంచి తీసుకొచ్చిన ఐదు దున్నరాజులను అలంకరించి పూజలు నిర్వహించి ఊరేగింపును ప్రారంభించారు. ఆ ప్రాంతాల నుంచి మొదలైన దున్నరాజుల ఊరేగింపు డప్పు వాయిద్యాల మధ్య, యువకుల నృత్యాలతో శోభాయమానంగా సాగింది. సాయంత్రం ఈ ఊరేగింపులో పద్మశ్రీ అవార్డు గెలుచుకున్న గోలీటూ భజరంగి, షేహెంష, కోహినూర్ దున్నరాజులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సత్యం, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మద్ది శ్రీనివాస్‌యాదవ్, చీర పంకజ్‌యాదవ్, గుండెబోయిన లింగయ్యాయాదవ్, ఏడుకొండలు, పిల్లి రామరాజుయాదవ్, జీవీ.యాదవ్, అల్లి సుభాష్‌యాదవ్, చంద్రయ్య, బెల్లి నాగరాజు, గుండెబోయిన సురేష్, చల్లా కోటేష్, నాగరాజు, పాల్గొన్నారు.

చిరకాల స్వప్నం
సాకారమయ్యే

అమ్మాయిలు కప్పు గెలిచేశారు..



సూర్యాపేటటౌన్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆకాశమే హద్దు.. అవకాశాన్ని వదలొద్దు.. అనే నినాదాన్ని నిజం చేస్తూ మహిళా భారత క్రికెట్ జట్టు ప్రపంచ కప్‌ను గెలుచుకుంది. కోట్లాది భారతీయుల ఆకాంక్షను నెరవేరుస్తూ భారత మహిళా క్రికెటర్లు తామేంటో ప్రపంచానికి చాటిచెప్పారు. పురుషుల క్రికెట్‌కు ఏమాత్రం తీసిపోనివ్వకుండా ప్రపంచాన్ని తమ వైపు చూసేలా భారత మహిళా క్రికెటర్లు అద్భుత ప్రదర్శన చేశారు. మహిళా ప్రపంచకప్ ఫైనల్‌లోకి ముచ్చటగా మూడోసారి ప్రవేశించిన మన జట్టు దక్షిణాఫ్రికాపై గెలిచి ప్రపంచకప్‌ను గెలుచుకుంది. దేశ ప్రజల ఆకాంక్షలను, ఆశలను భుజాలపై ఎత్తుకున్న మహిళా క్రికెటర్లు విశ్వకప్‌ను గెలిచి ప్రజల ఆనందపు హద్దులు దాటించారు. 2005, 2017లో భారత జట్టు మహిళా ప్రపంచకప్ ఫైనల్‌కు చేరి కప్పు గెలవకుండానే వెనుదిరగగా, ప్రస్తుత హర్మన్‌ప్రీత్ సేన చిరకాల స్వప్నాన్ని నిజం చేస్తూ విశ్వకప్‌ను సగర్వంగా గెలుచుకుంది. అటు తొలిసారి ప్రపంచకప్ ఫైనల్‌కు చేరుకున్న దక్షిణాఫ్రికా మహిళ జట్టు తుది సమరంలో ఓటమిని చవిచూసింది.

చివరి పంచ్ మనదే..

ఉత్కంఠ పోరాటాలతో విజయాలు సాధిస్తూ ఫైనల్‌కు చేరిన మన మహిళా జట్టు దక్షిణాఫ్రికాపై గెలిచి చివరి పంచ్ కొట్టింది. ఈ గెలుపు సమష్టివిజయంగా చెప్పవచ్చు. ఆస్ట్రేలియా వంటి బలమైన జట్టుపై భారీ లక్ష్యాన్ని జెమీ మారోడ్రిగ్స్ సెంచరీతో గెలిపించిన విధానం ఎప్పటికీ గుర్తుండిపోతుంది. భవిష్యత్‌లో మహిళలు క్రికెట్‌పై ఆసక్తి పెంచుకునేలా విశ్వకప్‌ను స్ఫూర్తిగా నిలవనుంది. జిల్లా ప్రజలు ఆదివారం మధ్యాహ్నం నుంచే టీవీలకు అతుక్కుపోయారు. ముఖ్యంగా మహిళలు, యువతులు మహిళా క్రికెట్ జట్టుకు మద్దతు ఇస్తూ టీవీల్లో మ్యాచ్‌ను వీక్షించారు. చివరికి జట్టు కప్పును అందుకున్న క్షణంలో తామే గెలిచాం అనే విధంగా మహిళలు, దేశమంతా ఒక్కటైంది.

గందరగోళం

- ఎంజీయూలో మెస్‌ల నిర్వహణ అస్తవ్యస్తం
- విద్యార్థి సంఘాల మధ్య ఆధిపత్య పోరు
- పలుమార్లు గొడవలకు కారణమవుతున్న వైనం
- పంపకాలపై సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆడియోలు
- విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నా నాణ్యతపై సర్వత్రా చర్చ



నల్లగొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ యూనివర్సిటీలో నిరంతరం ఏదో ఒక సమస్య రాజుకుంటూనే ఉంది. యూనివర్సిటీలో మెస్ నిర్వహణ అనేది గందరగోళానికి దారితీస్తుంది. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించుకునేందుకు ప్రభుత్వం, యూనివర్సిటీ అధికారుల నుంచి ఎప్పటి నుంచో అనుమతులు ఉన్నాయి. మెస్ నిర్వాహకులు విద్యార్థుల అభిప్రాయాలు, ఫిర్యాదులు అవసరానికి అనుగుణంగా కార్యకలాపాలను మెరుగుపరచడం లేదు. దీంతో మెస్‌లో నాణ్యత, పరిశుభ్రతను పర్యవేక్షించడం, ధరలు నిర్ణయించడంలో విద్యార్థులు, ఆయా సంఘాలు పెద్దగా శ్రద్ధ చూపించడం లేదు. దీంతో యూనివర్సిటీ విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యూనివర్సిటీలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చి విద్యనభ్యసిస్తున్న విద్యార్థిని, విద్యార్థులు హాస్టళ్లలో ఉంటున్నారు. తోటి విద్యార్థులు మెస్ నిర్వహిస్తున్నప్పుడు లాభాపేక్ష చూసుకోకుండా నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నా ఆలోచనకు రావడం లేదని హాస్టల్ విద్యార్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 800మందికి పైగా విద్యార్థులు హాస్టల్‌లో ఉంటూ మెస్‌లోనే అల్పాహారంతో పాటు భోజనం చేస్తుంటారు. మెస్‌లలో విద్యార్థుల ఇబ్బందులను యూనివర్సిటీ అధికారులు పర్యవేక్షించి ఉంటే ఈ సమస్యలు వచ్చి ఉండేవి కావని పలువురు చర్చించుకుంటున్నారు. మూడు నాలుగు నెలల క్రితం ఎంజీయూలో విద్యార్థినుల హాస్టల్‌లో గొడ్డుకారం విషయం గొడవకు దారి తీసిన విషయం తెలిసిందే. విద్యార్థినులకు నాణ్యమైన ఆహారంతో పాటు కూరగాయలు, నాన్‌వెజ్ వంటివి నిబంధనల మేరకు వడ్డించాల్సి ఉంది. కానీ నిబంధనలకు విరుద్ధంగా గొడ్డుకారం పెట్టారన్న ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. విద్యార్థినులు నిర్వాహకులను నిలదీయడంతో పాటు ఆందోళన కూడా చేపట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కూడా విద్యార్థి సంఘాల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతూనే ఉంది. రెండు రోజుల క్రితం కూడా ఎంజీయూలో వివిధ సమస్యలపై విద్యార్థులు ఆందోళనకు దిగారు. అయితే నిరంతరం ఏదో ఒక సమస్య గురించి యూనివర్సిటీ ఆవరణలో ఆందోళన చేపడుతున్నారు. యూనివర్సిటీలో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. యూనివర్సిటీలో సౌకర్యాల కొరతపై నిరసన వ్యక్తం చేశారు. తాజాగా యూనివర్సిటీలో మెస్ నిర్వహణకు సంబంధించి పంపకాల విషయంలో జరుగుతున్న చర్చకు సంబంధించి సోషల్ మీడియాలో ఆడియోలు వైరల్ అవుతున్నాయి. ఇకపోతే బియ్యం సరఫరాతో పాటు కూరగాయలు, ఇతర నిత్యావసర సరుకుల పంపిణీ విషయం కూడా వివాదాస్పదంగా మారుతుంది. తమకు అనుకూలమైన వ్యక్తుల నుంచి బియ్యం కొనుగోలు చేస్తున్నా ఆ బియ్యం నాణ్యత లేకున్నా మెస్ నిర్వాహకులు ప్రశ్నించకపోవడం ఏమిటని హాస్టల్ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూనివర్సిటీ అధికారుల దృష్టికి తీసుకపోవడానికి హాస్టల్ విద్యార్థులతో పాటు కొన్ని విద్యార్థి సంఘాల నాయకులు నిర్ణయించుకున్నట్లు సమాచారం. మెస్ నిర్వహణలో మార్పు తీసుకరాకపోతే రాష్ట్ర స్థాయి అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నా ఆలోచనకు వచ్చారు.

ఎత్తిపోతలు నత్తనడకన



- మూడేళ్లయినా ముందుకు సాగని పనులు
- వర్షాలతో నిర్మాణ ప్రాంతంలో నిండిన నీరు
- నిలిచిన ఎత్తిపోతల పథకాల పనులు

7

సాగర్ ఎడమకాల్వ ఆయకట్టు పరిధిలోని చివరి భూములకు నీరందించేందుకు ప్రారంభించిన నాలుగు ఎత్తిపోతల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడం తోనే పనులు మందకొడిగా కొనసాగుతున్నాయని అధికారులు చెబుతుండగా, బిల్లులు సకాలంలో మంజూరు కాకపోవడం వల్లేనని తెలుస్తోంది.
- (ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ)

జనగణన సక్రమంగా జరగాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



తిప్పర్తి మండల రైతు వేదికలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

తిప్పర్తి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జనగణన కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఆదివారం తిప్పర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 2027 జనాభా లెక్కల సేకరణలో భాగంగా రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో ముందస్తు జనగణన కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా నిర్వహిస్తోందన్నారు. పట్టణ ప్రాంతామైన జీహెచ్‌ఎంసీ, గ్రామీణ ప్రాంతమైన తిప్పర్తి మండలం, గిరిజన ప్రాంతమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ముందస్తు జనగణన కొనసాగుతోందన్నారు. తిప్పర్తి మండలంలోని మామిడాల, ఇండ్లూరు, సర్వారం, తిప్పర్తి, జంగారెడ్డిగూడెం గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టుగా గణన కొనసాగుతుందన్నారు. అందుకు 35మంది ఎన్యుమరేటర్లు, ఆరుగురు సూపర్‌వైజర్లకు తిప్పర్తి రైతు వేదికలో మూడు రోజులపాటు శిక్షణ ఇస్తున్నామన్నారు. తొలిసారిగా డిజిటల్ పద్ధతిలో నిర్వహించే ఈ జనగణనలో ఎలాంటి తప్పులు దొర్లకుండా సమర్థంగా నిర్వహించాలన్నారు. ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు నిర్దేశించిన విధంగా ఎన్యుమరేటర్లు డిజిటల్ విధానంలో జనాభా లెక్కలను పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్, రాష్ట్ర గణాంకశాఖ జేడీ లాజరస్, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, తహసీల్దార్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వాహనాల రాకపోకలు



కోతకు గురైన హైవేను మరమ్మతులు చేపట్టడంతో యథావిధిగా వెళ్తున్న వాహనాలు

డిండి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన జాతీయ రహదారిపై భారీ వర్షాలకు కోతకు గురైన ప్రాంతాన్ని అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. దీంతో ఆదివారం వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షానికి డిండి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరిగి దిగువన నీటి ధాటికి శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారి కోతకు గురైంది. నాలుగు రోజులుగా హైవేపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. జాతీయరహదారి అధికారులు కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

విద్యుదాఘాతంతో ఆవులు మృతి


ఆవుల కళేబరాలు

తుర్కపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రెండు పాడి ఆవులు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వేలుపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన రైతు గుడిపాటి సుధీర్‌రెడ్డి తన పాడి ఆవులను ఉదయం మేత కోసం వ్యవసాయ పొలంలోకి తీసుకెళ్లాడు. ఆవులు మేత మేసుకుంటూ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోకి వెళ్లాయి. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి షార్ట్‌సర్క్యూట్ కావడం తో పాడి ఆవులు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాయి. సుమారు రూ. 80వేలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

సంగెంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు


తవ్వకాలు జరిపిన ప్రదేశం

తుంగతుర్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా తుంగతుర్తి మండల పరిధిలోని సంగెం గ్రామంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు కలకలం రేపాయి. గుర్తుతెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు గ్రామస్థులు తెలిపారు. సమాధుల వద్ద రెండు రాతి గుండ్ల మధ్యలో గుర్తు తెలియని వ్యక్తులు తర్వాత తవ్వకాలు జరిపినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. సుమారు నాలుగు అడుగుల లోతు గుంత తవ్వారు. అధికారులు, పోలీసులు విచారణ చేపట్టి తవ్వకాలకు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం


ఆంజనేయులు(ఫైల్)

చింతలపాలెం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలో నాలుగు రోజుల క్రితం అదృశ్యమైన వ్యక్తి మృతదేహం ఆదివారం కృష్ణానదిలో లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి మేడతి ఆంజనేయులు(36) కుటుంబ సభ్యులతో నివసిస్తున్నాడు. గత నెల 30వ తేదీ నుంచి కన్పించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు, బంధువులు అన్ని చోట్లా వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా మఠంపల్లి మండలం మట్టపల్లి వంతెనపై అతని బైకు, చెప్పులు గుర్తించారు. చుట్టుపక్కల వెతికినా అతని ఆచూకీ లభించలేదు. ఆదివారం మధ్యాహ్నం కిష్టాపురం పుష్కరఘాట్ వద్ద కృష్ణానదిలో గుర్తు తెలియని మృతదేహం తేలాడుతూ ఉండడాన్ని జాలర్లు గుర్తించారు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరు కున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి పరిశీలించారు. అదృశ్యమైన వ్యక్తి కుటుంబ సభ్యులను పిలిపించి మృతదేహాన్ని చూపించగా వారు ఆంజనేయులిదిగా నిర్ధారించారు. మృతదేహం కుళ్లిపోవడంతో నదిలో నుంచి ఒడ్డుకు చేర్చి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఆంజనేయులు భార్య రాజ్యలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సందీప్‌రెడ్డి తెలిపారు. ఇది ప్రమాదశాత్తు జరిగిందా.. ఆత్మహత్యకు పాల్పడ్డాడా.. మరేదైనా కారణమా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఆంజనేయులుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి


బిట్టు అభివర్మ(ఫైల్)

పెన్‌పహాడ్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల పరిధిలోని దూపహాడ్ గ్రామంలో ఆదివారం జరిగింది. ఏఎస్‌ఐ రాములు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బిట్టు వీరభద్రయ్య చిన్న కూమారుడు అభివర్మ(24) ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్నాడు. గ్రామ శివారులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫ్యూజ్ తీగ సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. అభివర్మ తండ్రి వీర భద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్సపొందుతూ రైతు

రాజాపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం కుర్రారం గ్రామానికి చెందిన మాచర్ల వెంకటేశం(43) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వ్యవసాయంలో నష్టాలు రావడంతో ఆర్థికంగా నష్టపోయాడు. అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురై శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అపస్మారక స్థితిలో ఉన్న అయనను తల్లి గమనించి చికిత్సనిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వెంకటేశానికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.

అనారోగ్యంతో రిటైర్డ్ పోస్టుమన్


ఖాసీం(ఫైల్)

కేతేపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ పోస్టుమన్ ఎండీ.ఖాసీం(75) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందాడు. మండల కేంద్రం కేతేపల్లితో పాటు పరిసర గ్రామాల్లో పోస్టుమ్యాన్‌గా సుపరిచితుడైన ఖాసీం మృతదేహాన్ని పలువురు సందర్శించి నివాళులు అర్పించారు. ఖాసీం భార్య మూడేళ్ల క్రితమే మృతిచెందింది. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

నకిరేకల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యపై హైదరాబాద్‌లోని గాంధీ పార్కులో ఈ నెల 7వ తేదీన నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి అన్నారు. నకిరేకల్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈహెచ్‌ఎస్ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌కార్డు, 5డీఏ, పీఆర్‌సీ అమలు చేయాలని, ఎంతో కాలం నుంచి రావాల్సిన బకాయిలు ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. 7వ తేదీన నిర్వహించే ధర్నాలో పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి. వెంకట్‌రెడ్డి, జెల్లా శ్రీశైలం, కందాళ పాపిరెడ్డి, వీరమల్ల రవీందర్, చిక్కు రవీందర్, వంటల రామలింగం, కందుల సోమయ్య, పోతుల వెంకటనారాయణ, ఉత్తరమ్మ, భిక్షం రెడ్డి, పానుగంటి అంజయ్య, శివకోటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పాఠాలకు ఆటంకం కలగకుండా..

- సొంత డబ్బులతో తాత్కాలిక గది ఏర్పాటు
- విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా ఉపాధ్యాయుల పాఠాలు
- ఆదర్శంగా నిలుస్తున్న రాజాపేట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు


తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గదిలో పాఠాలు

పాఠశాలలో తరగతి గదుల సమస్య ఉన్నా సమన్వయంతో పనిచేస్తున్నారు యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలకేంద్రంలోని పీఎంశ్రీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు. వసతుల కొరత, చాలీచాలని తరగతి గదులున్నా విద్యార్థుల చదువులకు ఆటంకం కలగొద్దని సంకల్పించి ఉపాధ్యాయులే తలా కొన్ని డబ్బులు పొగుచేసి అసంపూర్తిగా ఉన్న గదిలోనే ప్రికాస్ట్ వాల్ ఏర్పాటు చేసి పాఠాలు బోధిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,రాజాపేట)

మండలకేంద్రంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం 335 మంది విద్యార్థులు ఉన్నారు. అందులో 140 మంది బాలికలు, 195 మంది బాలురు ఉన్నారు, మండలంలోని పుట్టగూడెం, కొండ్రెడి చెరువు, రేణికుంట, నర్సాపురం, బసంతాపురం, కాల్వపల్లి గ్రామాల నుంచి 147 మంది విద్యార్థులు వచ్చి చదువుకుంటారు. జిల్లాలోనే అత్యధికంగా విద్యార్థులున్న 7వ పాఠశాల ఇది. విద్యార్థులకు సరిపోను తరగతి గదులు లేవు. ప్రతి తరగతి గదిలో 30నుంచి40 మంది విద్యార్థులున్నారు. విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండడంతో 9, 10వ తరగతులను రెండు సెక్షన్‌లుగా పాఠాలు చెబుతున్నారు.

తాత్కాలిక గది ఏర్పాటు చేసి..

పాఠశాలలో తరగతి గదుల కొరత ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉపాధ్యాయులే స్వయంగా తలాకొన్ని డబ్బులు పోగు చేసి, అసంపూర్తిగా ఉన్న భవనంలో సుమారు రూ.35 వేలతో ప్రికాస్ట్ వాల్‌తో తాత్కాలికంగా తరగతి గ ది ఏర్పాటు చేసి పాఠాలు బోధిస్తున్నారు. పాఠశాలలో 9 తరగతులు ఉండగా 9 గదులు మాత్రమే ఉన్నాయి. వీటిలో నాలుగు గదుల్లో కంప్యూటర్ ల్యాబ్, ఏఆర్‌వీఎల్, ఏసీఎల్, సైన్స్ ల్యాబ్ నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు సరిపోను గదులు లేకపోవడంతో దాతలు నిర్మించిన కళావేదిక, ల్యాబ్‌లకు కేటాయించిన గదుల్లో తరగతులను నిర్వహిస్తున్నారు.

గదుల కొరత ఉంది



పాఠశాలలో విద్యార్థులకు సరిపోను తరగతి గదులు లేవు. విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండడంతో సెక్షనులు చేయడంతో పాటుగా గదుల కొరత ఉంది. నాలుగు గదుల్లో ల్యాబ్‌లు ఏర్పాటు చేయడంతో, ల్యాబ్‌లలో ఒకవైపు ల్యాబ్ మరోవైపు తరగతులు నిర్వహించాల్సి వస్తోంది.

- తడక రాజు, ప్రధానోపాధ్యాయుడు, రాజాపేట ఉన్నత పాఠశాల

తరగతి గదుల సమస్య తీర్చాలి



పాఠశాలలో గదుల కొరత ఉంది. సరిపోను గదులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే సమస్య పరిష్కరించాలి.

- పిట్టల ప్రదీప్, 10వ తరగతి విద్యార్థి.

అర్ధాంతరంగా నిలిచిన పనులు



పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి సమగ్ర శిక్షా అభియాన్ కింద రూ. 60లక్షలు మంజూరు కా గా, భవన నిర్మాణం చేపట్టి స్లాబ్ వరకు వచ్చింది. బిల్లులు రాకపోవడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అదేవిధంగా పీఎంశ్రీ పథకం కింద రెం డు గదుల నిర్మాణానికి రూ.26లక్షలు మంజూరు కా గా నిర్మాణ దశలో ఉన్నాయి. విద్యార్థులకు ఏర్పాటు చేసిన ల్యాబ్‌ల్లో ఇన్‌స్ట్రక్టర్లు లేకపోవడంతో ఉపాధ్యాయులే అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో 16 మంది ఉపాధ్యాయులకు 15 మంది ఉన్నారు. ఆంగ్లం బోధించే ఉపాధ్యాయ పోస్టు ఖాళీ గా ఉంది. అటెండర్ పోస్టు మంజూరు ఉన్నప్పటికీ డిప్యుటేషన్‌పై జిల్లాకేంద్రంలో విధులు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో 140 మంది బాలికలు ఉండగా విద్యార్థినులకు సరిపోను మూత్రశాలలు లేకపోవడం తో ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా విద్యార్థుల సమస్యలు తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో ఆత్మల పండగ


కట్టంగూరు మండలంలోని చిన్నపురి గ్రామంలో ఆత్మల పండుగలో పాల్గొన్న క్రైస్తవులు

కేతేపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో క్రైస్తవులు ఆదివారం ఆత్మల పండగ(ఆల్‌సోల్స్ డే)ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తమ కుటుంబాల్లో మృతి చెందిన పూర్వీకులు, కుటుంబసభ్యుల ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ ప్రతి ఏటా నవంబరు 2వ తేదీన క్రైస్తవులు పండగను నిర్వహి ంచడం ఆనవాయితీ. ఈ పండగను పురస్కరించుకుని శ్మశానవాటికల్లోని తమ బంధువులు, ఆత్మీయుల స్మృతి కట్టడాల (సమాధులు)ను శుభ్రం చేసి రంగులు వేసి పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. మండలంలోని భీమారం, ఇనుపాముల, రాయపురం, కేతేపల్లి గ్రామాల్లో ఆదివారం ఉదయం చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం గ్రామ శివారుల్లోని శ్మశానవాటికల్లో గల సమాధుల వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికలపై మత గురువులు ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి స్వర్గస్తులైన పెద్దలను స్మరించుకున్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో చర్చీల విచారణ గురువులు పాల్గొన్నారు.

కట్టంగూరు : నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలోని ముత్యాలమ్మగూడెం గ్రామపంచాయతీ పరిధి చిన్నపురి గ్రామంలో ఆదివారం క్రైస్తవుల సమాధుల(ఆత్మల) పండుగను నిర్వహించారు. గ్రామంలోని నిష్కలంకమాత ప్రార్థన మందిరంలో ఫాదర్ కాల్వలినో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ప్రార్థన మందిరం సమీపంలో ఉన్న సమాధులను పూలమాలలతో అందంగా అలంకరించింది. విద్యుత్ దీపాలు, కొవ్వొత్తులు, ప్రతిమలు వెలిగించి చనిపోయిన వారి ఆత్మలకు శాంతికలగాలని చర్చి ఫాదర్, క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో కొంక ప్రవీణ్, ప్రసాద్, ఆంథోని, కామినేని అలెగ్జాండర్, శాంసన్, కనుమూరి భాస్కర్, ప్రేమలత, రాయప్ప, సుధాకర్, మారయ్య, ప్రణయ్, విజయ్, శ్యాం, బాలరాజు, సుధీర్, కిషోర్ పాల్గొన్నారు.

కల్లాలు లేక.. రైతుల కష్టాలు



కల్లాలు అందుబాటులో లేకపోవడంతో కష్టాలు ఎదుర్కొంటున్నారు. దీంతో జాతీయ రహదారి సర్వీస్ రోడ్లపై ధాన్యం ఆరబోయాల్సిన పరిస్థితి నెలకొంది. యాదాద్రిభువనగిరి జిల్లా హైదరాబాద్- భూపాలపల్లి 163వ జాతీయ రహదారి భువనగిరి శివారులోని కలెక్టరేట్ సమీపంలోని రాయిగిరి సర్వీస్ రోడ్డుపై రైతులు ధాన్యం ఆరబోసుకుంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడిసింది. కొనుగోలు కేంద్రాలకు తరలించినా ఆ ధాన్యాన్ని నిరాకరిస్తుండడంతో గత్యంతరం లేక జాతీయ రహదారికి సంబంధించిన సర్వీసు రోడ్లను ఉపయోగించాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. రోడ్లపై ధాన్యం ఆరబోస్తే ప్రమాదాలు జరుగుతాయని, రోడ్లపై ధాన్యం ఆరబోయవద్దని రైతులకు అవగాహన కల్పిస్తున్నామని జాతీయ రహదారి అధికారులు పేర్కొంటున్నారు. • ఆంధ్రజ్యోతి, భువనగిరి రూరల్.

జాతీయ రహదారిపై ట్రాఫిక్‌జాం

• మూడు కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు


బ్రిడ్జి వద్ద వర్షపు నీరు చేరటంతో నెమ్మదిగా వెళ్తున్న వాహనాలు

చిట్యాలరూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-విజయవాడ 65వ నెంబరు జాతీయ రహదారిపై మళ్లీ ట్రాఫిక్‌జాం అయింది. నల్లగొండ జిల్లా చిట్యాల మండల కేంద్రం సమీపంలో ఈ ఘటన జరిగింది. ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జీ వద్ద నీరు రెండు అడుగుల మేర చేరడంతో వాహనాలు నెమ్మదిగా వెళ్లాయి. దీంతో చిట్యాల నుంచి పెద్ద కాపర్తి వరకు మూడు కిలోమీటర్లు ట్రాఫిక్ జామ్ అయింది. అదే విధంగా పెద్దకాపర్తి వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండటం, వాహనాలు సర్వీస్ రోడ్డు మీదకు మళ్లడమే కాకుండా తిరిగి రహదారిపైకి విజయవాడ వైపునకు ప్రయాణం కొనసాగిస్తున్నాయి. నీటిలో అర అడుగు మేర గుంత ఉండటంతో రాత్రి 11గంటల సమయంలోనూ నేషనల్ హైవే సిబ్బంది అక్కడే నించుని అందరినీ అప్రమత్తం చేస్తున్నారు. చిట్యాల వద్ద వాహనాల ప్రయాణం నెమ్మదించడంతో ఈ మార్గంలో రహదారిపై వెళ్లే వాహనాలన్నీ చిట్యాల నుంచి పెద్దకాపర్తి వరకు నిలిచి ట్రాఫిక్‌జాం కావడానికి కారణమవుతోంది. చిట్యాల ఎస్‌ఐ మామిడి రవికుమార్ పర్యవేక్షణలో సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అటుగా వెళుతున్న అంబులెన్స్ వర్షం నీటిలో ఇరుక్కుపోవడంతో స్థానికులు పక్కకు నెట్టుకుంటూ వెళ్లారు.

ఆశలు నీట మునిగి..

• వర్షాలతో దెబ్బతిన్న పంటలు • దిక్కుతోచని స్థితిలో రైతులు • పత్తిపంట నేలరాలి ఆందోళన


దేవరకొండ మండలం భీమనపల్లిలో వర్షానికి నేలరాలుతున్న పత్తి

మునుగోడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను దెబ్బతో రైతుల ఆశలు నీట మునిగాయి. వర్షాలతో పంటలు దెబ్బతినడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ఈ సీజన్‌లో నెలకొన్న ప్రకృతి వైపరీత్యాలు రైతుల పాలిట శాపంగా మారాయి. కొద్దిరోజులుగా నిరంతరం కురుస్తున్న వర్షాలకు చేతికొచ్చిన పత్తి, వరి వంటి పంటలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దీంతో కోటి ఆశలతో సాగు చేసిన పంటలు నీట మునిగాయి. వర్షం తాకిడికి పత్తి ముద్దయింది. దీనికి తోడు వరి పొలాలు నేలవాలాయి. ఇటీవల అకాల వర్షాలకు తోడు మొంథా తుపాను ప్రభావం తీవ్ర రూపం దాల్చుతోంది. పూత, కాత దశలో కురుస్తున్న వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతినటంతో తీవ్ర నష్టం వాటిలిందని, దిక్కుతోచని స్థితిలో ఉన్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ఎకరాకు వేల రూపాయల పెట్టుబడి పెట్టి సాగుచేసిన పంటలను అష్టకష్టాలు పడి పండిస్తే చేతికందిని సమయంలో వర్షాల తాకిడికి గురవుతున్నాయి. తడిసిన పత్తి నేలరాలటంతో పాటు రంగు మారుతోంది. నేలవాలిన వరిపంట నీట మునిగి పూర్తిగా దెబ్బతిని తీవ్ర నష్టం వాటిల్లిందని ఆందోళన చెందుతున్నారు. చేలో నుంచి తీసిన తడిసిన పత్తిని, నూర్పిడి చేసిన ధాన్యం విక్రయించడానికి ఇబ్బందులు తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన పంటలకు కనీసం గిట్టుబాటు ధరలు దక్కని పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలకు ఇంత పెద్దమొత్తంలో నష్టం వాటిల్లినా ప్రభుత్వం ఆదుకునేందుకు చర్యలు చేపట్టడం లేదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టించుకొని పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.


తడిసిన పత్తిని ఆరబెడుతున్న రైతులు


నీట మునిగిన చేతికొచ్చిన వరి పొలం


వర్షానికి నేలవాలిన చేతికొచ్చిన వరి పొలం

దేవరకొండ డివిజన్‌లో..


వర్షానికి దెబ్బతిన్న పత్తి పంటను చూపిస్తున్న రైతు

దేవరకొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంతోపాటు గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం నుంచి ముసురుతో కూడిన వర్షం కురిసింది. వర్షానికి పట్టణంలోని వీధులు జలమయం అయ్యాయి. మండలంతోపాటు డివిజన్‌లో వరుసగా వర్షాలు కురుస్తుండడంతో పత్తి, వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. దేవరకొండ డివిజన్‌లో 1.70లక్షల ఎకరాల వరకు పత్తి, 55వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. పంటలు చేతికొచ్చే సమయానికి తుపానుతో కూడిన వర్షాలు కురుస్తుండడంతో పత్తి, వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి పెట్టుబడులుపెట్టి పంట చేతికొచ్చే సమయానికి వర్షాలు రావడం, పంట నష్టం జరుగుతుండడంతో అప్పులే మిగులుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు పత్తిపంట నేలరాలుతుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట నష్ట పరిహారం అందజేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఎత్తిపోతలు నత్తనడకన

నాగార్జునసాగర్ ఎడమకాల్వ ఆయకట్టు పరిధిలోని చివరి భూములకు నీరందించేందుకు ప్రారంభించిన నాలుగు ఎత్తిపోతల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. 2023 ఆగస్టు నాటికే పనులు పూర్తికావాల్సి ఉండగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సైతం కొంత కాలంపాటు పనులు కొనసాగలేదు. ఆ తరువాత పనులు ప్రారంభమైనా నిర్మాణాల్లో జాప్యం చోటుచేసుకుంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతోనే పనులు మందకొడిగా కొనసాగుతున్నాయని అధికారులు చెబుతుండగా, బిల్లులు సకాలంలో మంజూరు కాకపోవడం వల్లేనని తెలుస్తోంది.

- (ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ)



- మూడేళ్లయినా ముందుకు సాగని పనులు
- వర్షాలతో నిర్మాణ ప్రాంతంలో నిండిన నీరు
- నిలిచిన ఎత్తిపోతల పథకాల పనులు

ఎడమకాల్వ ఆయకట్టు చివరి భూములకు సాగు నీరందక బీళ్లుగా మారుతుండటం, ఎగువ భూములకు నీటి సౌకర్యం లేకపోవడంతో అడవిదేవులపల్లి, దామరచర్ల మండలాల్లో నాలుగు ఎత్తిపోతల పథకాలకు గత ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సుమారు 25వేల ఎకరాలకు రెండు సీజన్లకు సాగునీరు అందించేందుకు ఎడమకాల్వపై దున్నపోతులగండి, దామరచర్ల, వీర్లపాలెం ఎత్తిపోతలను, మూసీ నదిపై కేశవపురం ఎత్తిపోతలను మంజూరు చేసింది. దున్నపోతులగండి, దామరచర్ల, వీర్లపాలెం ఎత్తిపోతల నిర్మాణ పనులు ప్రారంభమై మూడేళ్లయినా ముందుకు సాగడం లేదు. ఇప్పటి వరకు పంప్‌హౌస్ పనుల్లో 30 శాతం మాత్రమే పూర్తయ్యాయి. ఎత్తిపోతల పనులకు 2020 డిసెంబరులో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పాలనాపర అనుమతులు మంజూరు చేయగా, టెండర్ ప్రక్రియ పూర్తయి 2022 మార్చిలో అగ్రిమెంట్ పూర్తయి కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించారు. మొత్తం 18 నెలల్లో అంటే 2023 ఆగస్టు నాటికి ఈ పనులను పూర్తి చేయాలన్నది లక్ష్యం. ఆ తరువాత రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కొంత కాలంగా నిలిచిన ఈ పనులపై ప్రభుత్వం సమీక్ష నిర్వహించి ఈ ఏడాది ఆగస్టు నాటికి నిర్మాణ పనుల పూర్తికి లక్ష్యంగా నిర్ధారించింది. ఈ పనులు పూర్తిచేసి రైతులకు సాగునీరు అందిస్తామని ప్రకటించింది. అయితే ప్రస్తుతం వర్షాల కారణంగా పనుల్లో పురోగతి లేకపోవడంతో మరో ఏడాది నాటికి కూడా పూర్తయ్యే అవకాశం లేదని రైతులు పేర్కొంటున్నారు. వచ్చే ఏడాది వేసవిలోనైనా పనులు ముమ్మరం చేసి వానాకాలం నాటికి పంటలకు సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

ముందుకుసాగని బొత్తలపాలెం, వీర్లపాలెం పనులు..

తుంగపాడు వాగుపై నిర్మిస్తున్న బొత్తలపాలెం, వీర్లపాలెం ఎత్తిపోతల నిర్మాణపనులు ముందుకు సాగడంలేదు. రూ.229.5కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన బొత్తలపాలెం ఎత్తిపోతల పథకం కింద 8,600 ఎకరాలకు సాగునీరు అందించనున్నారు. 5,200 టేలెండ్ భూములు కాగా, కొత్తగా 3,400 ఎకరాలు సాగులోకి రానున్నాయి. 180 క్యూసెక్కులను వినియోగించుకునేలా డిజైన్ చేయగా, ప్రస్తుతం పంప్‌హౌస్ ప్రాంతం వరద నీటితో నిండింది. 8కి.మీ పొడవు ఏర్పాటు చేయాల్సిన పైప్‌లైన్ పనులు సైతం ముందుకు సాగడంలేదు. రూ.32.22కోట్లతో నిర్మిస్తున్న వీర్లపాలెం ఎత్తిపోతలను 30 క్యూసెక్కుల నీటిని వినియోగించుకునేలా డిజైన్ చేశారు. 6కి.మీ పైపులైన్‌తో 2,500 ఎకరాలతోపాటు కొత్త ఆయకట్టుకు నీరు అందించాలన్నది లక్ష్యం కాగా, ఈ పనుల్లో పురోగతిలేదు.

30 శాతం కూడా పూర్తికాని దున్నపోతులగండి

అడవిదేవులపల్లి మండలం చిట్యాల గ్రామం వద్ద రూ.219.90కోట్లతో దున్నపోతులగండి-బాల్నేపల్లి-చాంప్లతండ ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని చేపట్టారు. ఈ పథకం ద్వారా ఉల్సాపాలెం, ముల్కచర్ల, బాల్నెపల్లి, అడవిదేవులపల్లి, చిట్యాల, చాంప్లతండ, జిలకరకుంటతండ, కొత్తనందికొండ గ్రామాల రైతులకు ప్రయోజనం చేకూరనుంది. 6,300 ఎకరాల ఎడమకాల్వ ఆయకట్టు చివరి భూములు, ఎత్తులో ఉన్న 5,939 ఎకరాల నూతన విస్తీర్ణానికి మొత్తం 12,239 ఎకరాలకు సాగునీరు అందించాలన్నది లక్ష్యం. హాలియా నుంచి వచ్చే వాగు నుంచి 255 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసేలా దీన్ని డిజైన్ చేశారు. పంప్‌హౌస్ నిర్మాణ పనులు 30శాతం మాత్రమే పూర్తయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పంప్‌హౌస్ నిర్మాణ ప్రదేశం నీటితో నిండిపోవడంతో పనులు ముందుకు సాగడం లేదని అధికారులు చెబుతున్నారు. పైపులైన్ పనులు చేపట్టేందుకు రైతులు పంటలు సాగుచేసినందున పైపుల రవాణాకు సైతం అవకాశం లేదని పేర్కొంటున్నారు.

70శాతం పూర్తయిన కేశవపురం ఎత్తిపోతల

మూసీ నదిపై మంగల్‌దుబ్బతండ వద్ద కేశవపురం పంప్‌హౌస్ నిర్మాణం పూర్తికాగా, నీటిని పంపింగ్ చేయాల్సిన మోటార్లు బిగించాల్సి ఉంది. రూ.53 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణ పనులు ప్రారంభించగా, 8.4 కి.మీ ప్రధాన పైపులైన్ పనులు సైతం 70శాతం పూర్తయ్యాయి. ఇంటెక్ వెల్, ఛాంబర్ నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. ఈ ఎత్తిపోతల కింద 5,875 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించగా అందులో 2,000 ఎకరాలు ఎడమకాల్వ చివరి భూములకు సాగు నీరు అందించనున్నారు. దీంతో పాటు 3,875 ఎకరాలను నూతనంగా సాగులోకి తీసుకురానున్నారు. మంగల్‌దుబ్బతండ, మాల్‌తండ, కొండ్రపోలు, తెట్టెకుంట తదితర 10 గ్రామాల రైతులకు ఈ ఎత్తిపోతల పథకం ద్వారా ప్రయోజనం చేకూరనుంది.

జూన్ నాటికి పనులు పూర్తి చేస్తాం

వర్షంతో పంప్‌హౌస్ నిర్మాణ స్థలం మొత్తం నీటితో నిండింది. రైతులు వానాకాలం పంటలు సాగు చేయడంతో పైపులైన్ల ఏర్పాటు పనులు సైతం సాగడం లేదు. వర్షాలు తగ్గితే పనులు తిరిగి ప్రారంభిస్తాం. వచ్చే వేసవి కాలంలో పనులు పూర్తయ్యే అవకాశం ఉంది.

- ఇరిగేషన్ శాఖకు చెందిన ఓ అధికారి

పనులు పూర్తిచేసి నీటిని అందించాలి



గత ఏడాదే పూర్తికావల్సిన ఎత్తిపోతల పథకం పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఎడమకాల్వ కింద చివరి భూములకు నీరు అందక పంటలు సాగుకు నోచుకోక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేసి వచ్చే వానాకాలం నాటికైనా పంటలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలి.

- లావుడ్యా ఎర్రానాయక్, రైతు, కల్లేపల్లి

ప్రజల సంక్షేమానికి పాటుపడాలి

తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖను కాపాడుకుంటేనే రెవెన్యూ, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజల సంక్షేమానికి పాటు పడాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు లచ్చిరెడ్డి అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో ఆదివారం నిర్వహించిన టీజీటీఏ, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సహకారంతో రెవెన్యూ ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. రెవెన్యూ శాఖ ఉంటుందని రెవెన్యూ ఉద్యోగులకు 2026 పదోన్నతుల సంవత్సరం అవుతుందన్నారు. వారి సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధనకోసం ఈ రెండు సంఘాలు కృషిచేస్తాయన్నారు. సమీపంలో రెవెన్యూ ఉద్యోగులకు ప్రమోషన్లు వస్తాయని త్వరలో 100మంది తహసీల్దార్లు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి లభిస్తుందన్నారు. 2026 జనవరిలో రెవెన్యూ ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గతేడాది రెండు సంఘాలు చేపట్టిన కార్యక్రమాలపై అధ్యక్షులు రాములు, బాణాల రాంరెడ్డి వార్షిక నివేదిక సమావేశానికి సమర్పించారు. కార్యక్రమంలో ఉద్యోగుల జేఏసీ కో చైర్మన్ కేతావత్ రామకృష్ణ, టీజీటీఏ అధ్యక్షకార్యదర్శులు ఎస్.రాములు, రమేష్‌పాకా, బాణాల రాంరెడ్డి, వి. భిక్షం, సీసీఎల్ఏ యూనిట్ ప్రధాన కార్యదర్శి చైతన్య కృష్ణ, ఆర్డీవో కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, డీఎస్ వెంకన్న, మహిళా విభాగం అధ్యక్షురాలు సుజాతాచౌహాన్, పొదిల రవికుమార్, శ్రీనివాస్‌రెడ్డి, పల్లవి పాల్గొన్నారు.

తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న బీసీరెడ్డి

తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి. బీసీరెడ్డి, ముఖ్య సలహాదారులుగా ఆర్. గోవర్ధన్‌రెడ్డి, సెక్రెటరీ జనరల్‌గా ఎండీ తాజుద్దీన్‌బాబా, కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఎస్. నరేందర్, పి. శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా వి. వెంకటనారాయణ, ఎ. ఇంద్రసేనారెడ్డి, సెక్రెటరీ ఫైనాన్స్ ఆర్. శ్రీధర్, ఆఫీస్ సెక్రెటరీ టిఎస్. దుర్గాప్రసాద్ మరికొంతమందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా డి. మనోహర్, టీఆర్ ప్రసాద్ వ్యవహరించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎల్. మధుసూదన్‌రెడ్డి, టిజీ ఎస్పీడీసీఎల్ అధ్యక్షుడు కేపీ శ్రీనివాసులురెడ్డి, సంఘం నాయకులు రాజా, ఎన్. సుబ్రహ్మణేశ్వరరావు, మల్లికార్జున రావు, ఎం. నర్సింహులు, శ్రీనివాస్‌రెడ్డి, రణధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో భక్తుల సందడి

● నిత్య ఆదాయం రూ.66.76 లక్షలు

యాదగిరిగుట్ట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడం, కార్తీకమాసంలో సత్యదేవుని వ్రతాలు, కార్తీకదీపాలు వెలిగించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 63వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా, ఉభయ (ప్రత్యేక, ధర్మదర్శనం) క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి రాత్రి వరకు కిక్కిరిసిపోయాయి. ప్రత్యేక దర్శనానికి గంట, ధర్మదర్శనానికి రెండున్నర గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. కొండపైన, కింద వాహనాలతో నిండిపోయాయి. కొండపైన బస్టాండ్ ప్రాంగణంలో బస్సులు ఎక్కేందుకు భక్తులు ఎగబడగా ఇబ్బందులు పడ్డారు. నాలుగు బ్యాటరీ వాహనాల్లో మహిళలు, చంటి పిల్లల తల్లులు, వృద్ధులు, దివ్యాంగులను బ్యాటరీ వాహనాలతో పాటు లిఫ్ట్ ద్వారా తరలించారు. అధికారులు రద్దీకి తగినట్లు బస్సులు ఏర్పాటు చేసినా కొండకింద రోడ్లపైనే భక్తులు ఎదురు చూశారు. బస్టాండుల్లో భక్తులు సుమారు గంటపాటు నిరీక్షించారు. ఉదయం, సాయంత్రం బ్రేక్ దర్శనం, మధ్యాహ్నం రాజభోగం (ఆరగింపు) సమయాలు కలిపి దర్శనాలు నిలిపివేయడంతో మూడు గంటల పాటు ఉభయ క్యూలైన్లల్లో భక్తుల వేచి ఉన్నారు. ఆలయం ఉత్తర తిరువీధిలో భక్తులు ఫొటోలు దిగేందుకు భక్తులు పోటీ పడ్డారు. ప్రధానాలయం, కల్యాణోత్సవ మండపం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాలల వద్ద కూడా భక్తుల కోలాహలం కనిపించింది. కార్తీకదీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కొండ కింద ఆధ్యాత్మిక వాడలో అధిక సంఖ్యలో సత్యదేవుని వ్రతాలు జరిపించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 66,76,776 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో ఎస్. హరీష్ తెలిపారు. కొండకింద వ్రత మండపాల్లో సత్యదేవుని వ్రతాలు 1,372 జంటలు జరిపించారు. ఆదివారం రద్దీ నేపథ్యంలో ఒక బ్యాచ్ అధికంగా నిర్వహించినట్లు పర్యవేక్షకుడు దొమ్మాట సురేందర్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా ప్రతీ వారం నిర్వహించే సంగీత సభల్లో భాగంగా రంగాచార్య మ్యూజిక్ (హైదరాబాద్) అకాడమీ భక్తి సంగీత కార్యక్రమం భక్తులను అలరించింది.



ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవారు



గర్భాలయంలో క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

సుప్రభాత సేవతో స్వామి అమ్మవారిని మేల్కొల్పిన అర్చకులు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. అదేవిధంగా పాతగుట్ట స్వామి అమ్మవార్లకు పూజారులు నిత్య పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో జరిపారు. రాత్రి మహా నివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు.

చీకట్లో తులసీ కాటేజీ

కొండకింద తులసీ కాటేజీలో శనివారం రాత్రి సుమారు గంటన్నర పాటు చిమ్మచీకటి నెలకొంది. లోడ్ అధికమై నృసింహ సదనం వెనుకాల ఉన్న వైరింగ్ కాలిపోయింది. దీంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. దేవస్థానంలో అద్దె గదులకు విద్యుత్ సరఫరా గంటన్నర సమయం నిలిచిపోయినా అధికారులు స్పందించలేదని మెదక్ జిల్లాకు చెందిన అశోక్ అనే భక్తుడు వాపోయాడు. ఈ విషయమై ఎలక్ట్రికల్ ఏఈ ఆంజయ్య వివరణ కోరగా వాహనాల రాకపోకలు, అద్దె గదుల వద్ద భక్తుల రద్దీతో కాటేజీ ప్రాంగణం గజిబిజిగా మారింది. అరగంటలో మరమ్మతులు చేపట్టాం.

ఇష్టానుసారం కొబ్బరికాయ ధర

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకుంటారు. స్వామికి సమర్పించే కొబ్బరికాయలు కొనేందుకు వీలులేకుండా ధరలు కొండెక్కాయి. సాధారణ భక్తులు యాదగిరిగుట్ట స్వామికి కొబ్బరికాయలు సమర్పించాలంటే ధర విని వెనుకడుగు వేస్తున్నారు. కొబ్బరికాయల దుకాణాల వద్ద ధరలపై పట్టిక ఏర్పాటు చేయకపోగా వర్తకులు ఇష్టారీతిన విక్రయిస్తున్నారని పలువురు భక్తులు ఆరోపించారు. కొబ్బరికాయల దుకాణాల వద్ద ధరల పట్టిక ఏర్పాటు చేసేలా గత ఈవో ఏపూరి భాస్కర్‌రావు చర్యలు చేపట్టారు. ఆయన బదిలీ అనంతరం వర్తకులు ఇష్టానుసారంగా ధరలు పెంచి భక్తులకు విక్రయిస్తున్నరన్న ఆరోపణలు ఉన్నాయి. పూర్తిస్థాయి ఈవో లేక అజమాయిషీ కొరవడింది. వర్తకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అధికారులతో కుమ్మక్కైయ్యారని భక్తులు మండిపడుతున్నారు. వర్తకులపై చర్యలు తీసుకొని కొబ్బరికాయల ధరలను తగ్గించాలని హిందూ వాహిని జిల్లా అధ్యక్షుడు కదారి శివ డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



స్వామివారిని ఊరేగిస్తున్న పాలకమండలి సభ్యులు, అధికారులు

వలిగొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వెంకటాపురం గ్రామ పంచాయతీ పరిధిలో మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం గుట్టపై స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వేదపండితుల, అర్చకుల పారాయణాలు, హోమాలు, చతుస్థానార్చన, బలిహరణం, నివేదన ఉత్సవమూర్తులను స్నపనం హనుమత్ వాహన సేవా, పూర్ణాహుతి, ద్వారాతోరణ ధ్వజ కుంభ ఆరాధన నిర్వహించారు. నరసింహుడి కళ్యాణ సందర్భంగా శ్రీ మత్‌భాగవత, రామాయణాలు, పంచసూక్త పారాయణాలు జరిగాయి. యజ్ఞయగాలను చేయడానికి కొండపై నిర్మించిన యజ్ఞశాలలో ఆగమ శాస్త్ర పద్ధతిలో హోమాలు జరిపారు. వేద పండితుల వేద పఠనంతో మత్స్యగిరి కొండ కోలాహలంగా మారింది. సుప్రభాత సేవలో స్వామిని మేల్కొలిపి అర్చన, ఆరాధన నిర్వహించారు. యాగశాలకు నాలుగు ముఖద్వారాలను శాస్త్రోక్తంగా యజ్ఞాచార్యులు నిర్దేశించి సామవేదం, రుగ్వేదం, అథర్వణ, యజుర్వేదాలను నాలుగు దిక్కులకు ప్రతిష్ఠించారు. యాగశాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానించడానికి వేద మంత్రాలతో చతుస్థానార్చన చేశారు. అనంతరం స్వామివారిని పుష్పాలు, తోరణాలతో అందంగా అలంకరించారు. ఉత్సవమూర్తిని హనుమంతుని వాహనంపై ప్రతిష్ఠింపజేసి తదుపరి నాదస్వరాలు వేద పఠనాలు భజనాల మధ్య గుట్టపైన ఊరేగించారు. ఉత్సవమూర్తులకు శంఖుధార, చక్రధార మంగళస్నానం జరిపించారు. కొండపైన ఉన్న పుష్కరిణిల చుట్టూ అర్చకులు ప్రదక్షణలు జరిపారు. బలిహరణం చేపట్టారు. మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామిని జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. శ్రీకార కూచిపూడి ఆర్ట్ అకాడమీ కళాకారులచే కూచిపూడి నృత్యం ప్రదర్శన చేశారు. వలిగొండకు చెందిన కళాకారులచే నరసింహస్వామి, చెంచు లక్ష్మీ పరిణయం ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ కుమార్ రెడ్డి, దేవస్థానం ఈవో మోహన్‌బాబు, ధర్మకర్తలు అరూరు వెంకటేశ్, రేఖల ప్రభాకర్ గౌడ్, బండి రవికుమార్, గుండు జగన్మోహన్‌రెడ్డి, ఈతాప రాములు ఉన్నారు.

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 11 గంటలకు మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి కలాణమహోత్సవం నిర్వహించనున్నారు కల్యాణ తంతును తిలకించడానికి హాజరయ్యే భక్తులకు ఆలయ అధికారులు అన్ని వసతులు ఏర్పాట్లు చేసింది.

నాలుగు గేట్లనుంచి నీటి విడుదల

● 589.60 అడుగుల వద్ద సాగర్ నీటిమట్టం



నాగార్జునసాగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు నాలుగు క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి 589.60అడుగులుగా (310.8498టీఎంసీలు) నమోదైంది. సాగర్ నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 32,886 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 7,033 క్యూసెక్కులు, నాలుగు గేట్ల నుంచి 32,232 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్‌నుంచి మొత్తం 72,151 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుండగా ఎగువనుంచి 72,151 క్యూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరుతోంది.

మూసీకి తగ్గిన ఇన్‌ఫ్లో

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. ఎగువ మూసీ నది పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు 10రోజులుగా వరద నీరు మూసీ ప్రాజెక్టును ముంచెత్తుంది. ఎగువన వర్షాలు తగ్గినా ఆయా ప్రాంత చెరువులు, కుంటల అలుగులు పారుతుండడంతో ఇటీవలి వరకూ దిగువకు వరద నీటిరాకడ కొనసాగింది. ఆదివారం సాయంత్రానికి ఇన్‌ఫ్లో 6527.50క్యూసెక్కులుగా నమోదయ్యింది. మరోవైపు ప్రాజెక్టు 645అడుగుల పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరువలో ఉండడంతో ప్రాజెక్టు అధికారులు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోను వచ్చింది వచ్చినట్లు ప్రాజెక్టు 2, 3, 4, 8, 10వ నెంబరు క్రస్టు గేట్లను 2అడుగుల మేర ఎత్తి దిగువ మూసీకి విడుదల చేస్తున్నారు.

చిన్ననాటి జ్ఞాపకాల యాదిలో..

40 ఏళ్ల తర్వాత కలుసుకున్న శారాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1985-86 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఆలేరు రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని శారాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1985-86 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఒక చోట కలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో 40 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారి ఆనందానికి అవధులు లేవు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరి నొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయుడు అంజిరెడ్డి మాట్లాడుతూ మరుపురానిది, మరువలేనిది, మధురమైనది చిన్ననాటి జ్ఞాపకాలన్నారు. స్వార్థం వీడి సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఆయప పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సైదాబేగం, పాములపర్తి రాంచంద్రారెడ్డి, దయ్యాల దేవేందర్, కె సత్తయ్య, డి కొండయ్య, శ్రీనివాస్, నవనీత, స్వరూప, అబ్బాస్, మణెమ్మ, కళాబాయి, హేమలత, శ్రీనివాస్, ఈశ్వరమ్మ, మల్లారెడ్డి, నారగోని శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

రాజ్యాంగ సవరణతో బీసీ బిల్లుకు మోక్షం కలిగించాలి

మిర్యాలగూడ టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ సవరణతో బీసీ రిజర్వేషన్ల బిల్లుకు మోక్షం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుగౌడ్ కోరారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు జరిగేందుకు అన్ని పార్టీలు సహకరించాలన్నారు. జనాభాలో సుమారు 60 శాతమున్న వెనుకబడిన వర్గాలను ముందుకు నడిపించాలంటే చట్ట సవరణ అవసరమన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కర్నాటి శివరామకృష్ణ, మాజీ కౌన్సిలర్ కోల వెంకన్న, నాయకులు మచ్చ ఏడుకొండలు, వేముల బాలు, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

మర్రిగూడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివన్నగూడ రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించనున్నట్లు ఆ సంఘం చైర్మన్ బాలం నరసింహ తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శివన్నగూడ రైతు సేవ సహకార సంఘం ద్వారా కుదాభక్షపల్లి, శివన్నగూడ గ్రామాల్లో రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

బీన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయునికి సన్మానం

మర్రిగూడ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బంజారా ఎంప్లాయిస్ అసోసియేషన్ నారాయణపురం (బీన్) ఆధ్వర్యంలో ఇటీవల పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు, నూతనంగా ఉద్యోగం సాధించిన వారిని సన్మానించారు. ఇటీవల గ్లోబల్ పీస్ అవార్డు ఇంటర్నేషనల్ టీచర్ ఎక్సలెన్సీ అవార్డు పొందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాంకు అసోసియేషన్ నాయకులు హార్టికల్చర్ డైరెక్టర్ కరంటోతు సురేష్, హార్టికల్చర్ ఏడీ బాబురావు, గురుకుల సెక్రటరీ మదునాయక్, తదితరులు సన్మానించారు.

మానవీయ విలువల సమాహారం బైరెడ్డి కవిత్వం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రసేన్, రచయితలు

నల్లగొండకల్చరల్, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): మానవీయ విలువలు, సామాజిక స్పృహ సమాహారం బైరెడ్డి కవిత్వమని కేంద్రసాహిత్య అకాడమీ సభ్యుడు ప్రసేన్ అన్నారు. పట్టణంలోని జడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం బైరెడ్డి కృష్ణారెడ్డి రాసిన 'ది అన్ ఫేడింగ్ అన్ ఫోల్డ్' ఆంగ్ల కవిత్వ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించి మాట్లాడారు. సమాజాన్ని చైతన్యపరిచే రచనలు మరిన్ని రావాలని ఆయన ఆకాక్షించారు. రచయితలు, సాహితీవేత్తలు మేరెడ్డి యాదగిరిరెడ్డి, సీతారాం, కోయి కోటేశ్వరరావు, పగడాల నాగేందర్, సతీష్‌రెడ్డి, రాంభాస్కర్‌రెడ్డి, కృష్ణలు పుస్తకంపై విశ్లేషణ చేశారు. సాహితీవేత్త సుంకిరెడ్డి నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు డాక్టర్ తండు కృష్ణకౌండిన్య, మునాస వెంకట్, నోముల రాహుల్, సాగర్ల సత్తయ్య, బండారు శంకర్, గోనారెడ్డి, వెంకన్న, ఎలికట్టె శంకర్‌రావు, పెరమాళ్ల ఆనంద్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక తులసీ కల్యాణం



కట్టంగూరులో తులసీ కల్యాణంలో పాల్గొన్న మహిళలు

కట్టంగూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక మాసం సందర్భంగా మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ స్వామి దేవస్థానంలో ఆదివారం తులసీ కల్యాణం, దామోదర పూజ కార్యక్రమాన్ని పూజారి రామడుగు శ్రీనివాస శర్మ, అశ్విన్‌శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. తులసీ కల్యాణం, దామోదర పూజలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కొంపెల్లి లక్ష్మయ్య మంగమ్మ, కడవేరు కృష్ణవేణి, గుడిపాటి పద్మ, ఇల్లెందుల సంధ్య, మణెమ్మ, కొత్త శోభ, మీలా పావని, సైదమ్మ, పద్మ, వెంకటమ్మ, యాదమ్మ, రూప, శోభ, రాజ్యలక్ష్మి, సంధ్య, ఆలయ కమిటీ సభ్యులు రెడ్డిపల్లి మనోహర్, రమేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిలుకు ద్వాదశి వేడుకలు

నార్కట్‌పల్లి: కార్తీకమాసం బహుళ ద్వాదశిని పురస్కరించుకుని నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని వారిజాల వేణుగోపాలస్వామి దేవాలయంలో ఆదివారం చిలుకు ద్వాదశి వేడుకలను భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. తొలుత శ్రీకృష్ణుని విగ్రహానికి ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులు, వేణాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బెల్లం, గోధుమపిండి, పాలు, చక్కెర, నెయ్యి తదితర పదార్థాలతో మిశ్రమం చేసిన రసాన్ని చెరుకు గడతో చిలికి స్వామికి, తులసీమాతకు నైవేద్యం పెట్టి భక్తులు కూడా ప్రసాదంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక శ్రీధర్, సామ కొండల్‌రెడ్డి, దూదిమెట్ల స్రవంతి, పసునూరి కిషన్, రమేశ్, గర్రె కళమ్మ, ధనమ్మ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిళ్ల బహూకరణ



దివ్యాంగులకు ట్రైసైకిళ్లు బహూకరిస్తున్న కిట్టు

నార్కట్‌పల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లారెడ్డిగూడెంనకు చెందిన దివ్యాంగులకు బ్యాటరీతో నడిచే ట్రైసైకిళ్లను ఆదివారం బహూకరించారు. ఎల్లారెడ్డిగూడెంనకు చెందిన యెల్లెందుల కిట్టు సొంత నిధులు రూ. రూ. 40వేల వెచ్చించి ఇదే గ్రామానికి చెందిన నడవలేని ఇద్దరు దివ్యాంగులు చిక్కుళ్ల వెంకటయ్య, చిక్కుళ్ల పాపులుకు బ్యాటరీతో నడిచే ట్రైసైకిళ్లను బహూకరించాడు. నడవలేని తమ బాధను చూసి ట్రైసైకిళ్లను బహూకరించిన కిట్టుకు ట్రైసైకిల్ గ్రహీతలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ వడ్డే భూపాల్‌రెడ్డి, మాజీ సాగర్ల సైదులు, చిక్కుల రాములు, రేగట్టె సతీష్, చిక్కుల శివ, పెద్దులు, వడ్డే రవీందర్‌రెడ్డి, బొడ్డుపల్లి శంకర్, సాగర్ల మల్లయ్య, దాసారపు శేఖర్, కేశవులు, మేడి నవీన్, బొల్లారి కృష్ణ, ఉమేష్, సందీప్, రేగట్టె చందు, సిసింద్రీ, శివ, శ్రీను, కృష్ణ, విజయ్ పాల్గొన్నారు.

పనుల పునరుద్ధరణకు సర్వే

(5వ పేజీ తరువాయి)

ఈ పనులన్నింటినీ 2028 జూన్‌లోగా పూర్తి చేయాలని ప్రాథమికంగా నీటి పారుదల శాఖ ఇంజనీర్లకు రాష్ట్ర ప్రభుత్వం డెడ్‌లైన్ విధించింది. సోమవారం ప్రారంభించే సర్వే సందర్భంగా ప్రాజెక్టు పనుల గురించి ఇరిగేషన్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చే అవకాశం ఉంది. ఈ కార్యక్రమానికి నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాలునాయక్, రాజగోపాల్‌రెడ్డి, వంశీకృష్ణ, జైవీర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, వేముల వీరేశం, ఎమ్మెల్సీలు శంకర్ నాయక్, నెల్లికంటి సత్యం హాజరవుతారని ఇరిగేషన్ అధికారుల పేర్కొన్నారు.

ఒడిదుడుకుల ప్రయాణం

- మర్రిగూడ బైపాస్ వద్ద ప్రమాదకరంగా వాహనాల రాకపోకలు
- ఫ్లైఓవర్ ఆలస్యంతో ట్రాఫిక్‌కు అంతరాయం
- తరచుగా ప్రమాదాలు
- వేగంగా పూర్తి చేయాలని ప్రజల విజ్ఞప్తి



మర్రిగూడ బైపాస్ వద్ద ప్రమాదకరంగా వాహనాల రాకపోకలు

నల్లగొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని నార్కట్‌పల్లి - అద్దంకి రహదారి మర్రిగూడ బైపాస్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం ఏళ్ల తరబడి సాగుతుండటంతో ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మర్రిగూడ బైపాస్ వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటం వల్ల ఒక్కొక్క సారి గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతుంది. మిర్యాలగూడ వైపు నుంచి నార్కట్‌పల్లి, హైదరాబాద్ వైపు వెళ్లే కార్లు, లారీలు, కంటైనర్లు వెళ్లే సమయంలో మలుపు వద్ద సమస్యలు ఎదురవుతున్నాయి. ఒక్కొక్క సారి ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. నార్కట్‌పల్లి వైపు నుంచి నల్లగొండకు వాహనాలు వెళ్లే సమయంలో కూడా ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఉంటున్నాయి. ట్రాఫిక్ పోలీసులకు కూడా ఒక్కొక్క సారి సమస్యలు పరిష్కరించడం తలనొప్పిగా మారుతుంది. బైపాస్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం నత్తనడకన సాగుతుండటమే దీనికి ప్రధాన కారణమని పలువురు పేర్కొంటున్నారు.

ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో..

నల్లగొండ పట్టణంలోని నల్లగొండ బైపాస్‌లో నిర్మాణమవుతున్న ఫ్లైఓవర్ సకాలంలో పూర్తి కాకపోవడంతోనే ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. నిరంతరం వందలాది వాహనాలు వెళ్లే నార్కట్‌పల్లి - అద్దంకి రహదారిపై ఫ్లైఓవర్ నిర్మాణం ఎందుకు నెమ్మదిగా సాగుతుందనే దానిపై అధికారులు సైతం చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఈ నిర్మాణం పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియకపోవడంతో వాహనదారులు ప్రతీరోజు ఇబ్బందులు పడుకుంటూ వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు. ఫ్లైఓవర్ పక్కన రోడ్డు కూడా ఇరుకుగా ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. దీనికి తోడు ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలు బైపాస్‌కు వచ్చిన సమయంలో తాము వెళ్లాల్సిన రోడ్డు ఎటూ వైపు ఉందో కూడా తెలియని విధంగా ఆ ప్రాంతంలో పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా అధికారులు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వాహనదారులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.



బైపాస్‌రోడ్డు వద్ద అస్తవ్యస్తంగా వస్తున్న వాహనాలు

గుంతలమయమైన రోడ్డు.....

ప్రధానంగా మిర్యాలగూడ, నల్లగొండ నుంచి హైదరాబాద్ వైపు, హైదరాబాద్, నార్కట్‌పల్లి నుంచి నల్లగొండకు వచ్చే వాహనదారులు బైపాస్ వద్ద గుంతమయమైన రోడ్డుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ఆర్‌అండ్‌బీ అధికారులు కనీసం రోడ్డు మరమ్మతులు కూడా చేయించకపోవడం గమనార్హం. ఉదయం, పగలు, రాత్రి అని తేడా లేకుండా ఎప్పుడు మూలమలుపుల్లో వాహనాలు నెమ్మదిగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. హైదరాబాద్ నుంచి మిర్యాలగూడ వెపు వెళ్లే వాహనాలకు ఫ్లైఓవర్ ప్రక్క నుంచి సర్వీస్ రోడ్డు ఉండటం వల్ల పెద్దగా ఇబ్బందులు లేవు. అయితే నల్లగొండకు వచ్చే వాహనాలతో పాటు హైదరాబాద్ వెళ్లే వాహనాలకు మాత్రం తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయి. ఫ్లైఓవర్ పక్కన మొత్తం గుంతలయమైన రోడ్లు ఉండటం వల్ల తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా సంబంధిత శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

● నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



చిట్యాల మండలం పెద్దకాపర్తిలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

చిట్యాలరూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో గల ప్రగతి కాటన్ ఇండస్ట్రీస్, కావేరి జిన్నింగ్ మిల్లుల్లో ఆదివారం పత్తి కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులకు నష్టం జరుగకుండా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీసీఐ అధికారులు, కాటన్ మిల్లుల యాజమాన్యాలు దృష్టిని సారించాలని సూచించారు. జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే పత్తిని విక్రయించి మద్దతు ధరను పొందాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో చౌటుప్పల్ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వెలిమినేడు పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు సప్పిడి సంజీవరెడ్డి, బోయ వెంకట్‌రెడ్డి, కరంబోతు శంకర్‌నాయక్, కార్యదర్శి వేముల రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బొంతల అంజిరెడ్డి, సీపీవో దర్మాల, శిశుపాల్ రెడ్డి, అంజనేయులు, వెంకటేశ్వర్లు, లింగస్వామి పాల్గొన్నారు.

చిట్యాల: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాల పట్టణంలోని శివాలయంలో ఆదివారం శివలింగానికి కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు. అనంతరం అయ్యప్ప మాలధారులకు మండలం పాటు నిర్వహించే అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నాయకులు ఎద్దులపూరి కృష్ణ, మారగోని అంజనేయులు, ఏర్పుల పరమేశం, మోహన్, వెంకటేశ్వర్లు, సత్తయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

నకిరేకల్: మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఉచిత చేప పిల్లలను పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని పన్నాలగూడెం పెద్ద చెరువులో ఆదివారం ఉచిత చేపపిల్లలను ఆయన వదిలి మాట్లాడారు. నియోజకవర్గంలో 223 చెరువుల్లో 1.05 కోట్ల లక్షల ఉచిత చేప పిల్లలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి రాజారాం, ఏఎంసీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజిత శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఆఖరి మజిలీకి అవస్థలు

(5వ పేజీ తరువాయి)

ఆంధ్రజ్యోతి విజిట్



చండూరు : లకినేనిగూడెంలో ఇళ్ల మధ్యలోనే దహనసంస్కారాలు చేస్తున్న గ్రామస్థులు (ఫైల్)

వాటిక స్థలం ఆక్రమణలకు గురైందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికే సదరు స్థలంపై వివాదాలు, కోర్టు కేసులున్నట్టు స్థానికులు చెబుతున్నారు. గాంధీనగర్‌లోని శ్మశానవాటిక ప్రహరీ స్థలం వివాదంలో ఉండగా, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో సమస్యను పరిష్కరించగా, అభివృద్ధికి నిధుల కొరత అడ్డుపడుతోంది. రూ.20కోట్ల అంచనాలతో అనుమతి పొంది మూడేళ్ల క్రితం ఆరంభించిన పనులు నిధుల కొరతతో నిలిచిపోయాయి. కుటుంబ సభ్యులు, ఐనోళ్లను కడసారి చూసేందుకు వచ్చిన బంధుమిత్రులు ఆయా శ్మశానవాటికల్లో అరకొర వసతుల నడుమ తూతూమంత్రంగా అంత్యక్రియలు జరిపే పరిస్థితి ఉంది. ప్రశాంత వాతావరణంలో దహనం సంస్కారాలు, అంత్యక్రియలు నిర్వహించేలా శ్మశానవాటికలను అభివృద్ధి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

● నిధుల మంజూరు అరకొరగానే

పట్టణ మునిసిపాలిటీకి అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ రూ.16.70కోట్లు విడుదలైనప్పటికీ అందులో కేవలం రూ. కోటి మాత్రమే శ్మశానవాటికల అభివృద్ధికి కేటాయించినట్లు సమాచారం. అది కూడా ఆక్రమణలకు గురవుతున్న ఈదులగూడ శ్మశానవాటిక ప్రహరీనిర్మాణానికేనని మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఓ అధికారి తెలిపారు.

సౌకర్యాలు లేమితో ఇబ్బందులు

(ఆంధ్రజ్యోతి, చండూరు): చండూరు మునిసిపాలిటీ 2018లో ఏర్పడింది. మునిసిపాలిటీ పరిధిలో మొత్తం 10వార్డులు ఉండగా, చండూరు, లక్కినేనిగూడెం, అంగడిపేట గ్రామాలు ఉన్నాయి. అంగడిపేట, చండూరు పట్టణంలో ప్రభుత్వ ఏర్పాటు చేసిన శ్మశానవాటికలు ఉన్నాయి. చండూరు పట్టణంలో దహన సంస్కారాలకు సరైన సౌకర్యాలు లేక ఓ సామాజికవర్గానికి చెందిన చందాలు వేసుకుని శ్మశానవాటికను ఏర్పాటు చేయగా, అధికారులు కనీస వసతులు కల్పించలేదు. లక్కినేనిగూడెంలో శ్మశానవాటిక లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

దుర్వాసన వస్తోంది



మా కాలనీ సమీపంలోనే శ్మశానవాటిక ఉంది. శవాలను దహనం చేస్తున్నప్పుడు దుర్వాసన, పొగ వస్తోంది. భయాందోళనకు గురవుతున్నాం.

- తిరందాసు నందు చండూరు

సమస్య పరిష్కారానికి కృషి



శ్మశానవాటికల సమస్య నా దృష్టికి వచ్చింది. ఉన్నతాధికారులకు సమాచారాన్ని చేరవేస్తాం. ప్రభుత్వ స్థలాల్లో దహన సంస్కారాలకు ఏర్పాట్లు చేయడానికి పరిశీలిస్తాం.

- ఎన్.మల్లేశం, మునిసిపల్ కమిషనర్, చండూరు

కల్వర్టు లేక.. పొలాలకు వెళ్లలేక



కల్వర్టు నిర్మించాల్సిన ప్రదేశాన్ని చూపుతున్న ఏపీలింగోటం గ్రామస్థులు

నార్కట్‌పల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీటితో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. రోడ్డుపై కల్వర్టు లేక రైతులు ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. భారీ వర్షాలు కురిసి చెరువు అలుగుపోసినప్పుడల్లా రైతులకు ఈ సమస్య తప్పడం లేదు. ఈ అలుగు నీటి కారణంగా అవతల ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తరలించడం రైతులకు మరింత ఇబ్బందిగా మారింది. తాత్కాలికంగా మట్టితో మరమ్మతులు చేసి రాకపోకలు కొనసాగిస్తున్నారు. నార్కట్‌పల్లి మండలంలోని ఏపీలింగోటం గ్రామం నుంచి పోతినేనిపల్లెకు వెళ్లేందుకు మట్టిరోడ్డు ఉంది. ఈ రోడ్డును బీటీగా మార్చాలని గ్రామస్థులు పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. అయినా నేటికీ మట్టిరోడ్డు బీటీగా మారలేదు సరికదా ఉన్న మట్టిరోడ్డు కూడా వర్షాలకు ధ్వంసమై రాకపోకలకు అసౌకర్యంగా మారింది. ఇదిలా ఉంటే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఏపీలింగోటం చెరువు నిండి అలుగుపోసింది. అలుగు ద్వారా వచ్చిన నీరంతా ఈ మట్టిరోడ్డు పైనుంచే ప్రవహించడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. మోకాళ్లలోతు నీటితో రాకపోకలు ఇబ్బందిగా మారాయి. బీటీ రోడ్డు మంజూరు ఎప్పుడు చేసినా ఏమో కానీ ప్రస్తుతానికి రోడ్డుపై ప్రయాణించడానికి వీలుగా కనీసం కల్వర్టునైనా నిర్మించేందుకు ఎమ్మెల్యే వేముల వీరేశం కృషి చేయాలని గ్రామస్థులు పాలకూరి శివ, మేడి యేసు, పోశబోయిన శివ తదితరులు కోరుతున్నారు.

ప్రధాన రోడ్డుపై భారీ గుంత

● పట్టించుకోని అధికారులు ● నిలిచిపోయిన వాహనాల రాకపోకలు



గరజాల - కొత్తపల్లి గ్రామాల మధ్య పడిన భారీ గుంత

శాలిగౌరారం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండల కేంద్రం నుంచి మోత్కూరుకు వెళ్లే ప్రధాన రహదారిలో గురజాల - కొత్తపల్లి గ్రామాల మధ్య పెట్రోల్ బంకు వద్ద కల్వర్టు, గూనలు పగిలి పెద్ద అగాధం ఏర్పడింది. ఈ రోడ్డు పంచాయతీరాజ్ విభాగం పరిధిలో ఉంది. ఈ కల్వర్టు పగిలి 5 రోజులు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో ఈ ప్రధాన రహదారిపై నిత్యం వందలాది భారీ వాహనాలు, బస్సులు నిలిచిపోయాయి. బస్సులు బంద్ కావడంతో వల్లాల మోడల్ స్కూల్‌కి వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ధ్వంసమైన కల్వర్టును శాలిగౌరారం తహసీల్దార్ బిట్ల వరప్రసాద్, ఆర్ఐ మహమ్మద్ రఫీద్ పరిశీలించి పంచాయతీరాజ్ విభాగం అధికారులకు తెలిపిన ఇంత వరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని నూతన కల్వర్టును నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

కార్మికుల హక్కుల కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలి

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ

మర్రిగూడ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల సాధన కోసం కార్మికులందరూ సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సీఐటీయూ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మికవర్గం ఐక్యంగా సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్మికవర్గ సమస్యలపై చర్చించడానికి నవంబరు 29, 30వ తేదీల్లో నల్లగొండలో జరిగే సీఐటీయూ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సీఐటీయూ మర్రిగూడ మండల కమిటీని ఎన్నుకున్నారు. నక్క నరసింహ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య, సీఐటీయూ జిల్లా నాయకులు జెర్రిపోతుల ధనంజయ, నాయకులు ఏర్పుల పద్మ, ఏర్పుల లింగస్వామి, రమావత్ రాజునాయక్, మట్టం భాగ్యమ్మ, జంపాల వసంత, ఎస్‌కె.కాశీం, మంజుల, రాఘవేంద్ర, కొట్టం యాదయ్య, కృష్ణయ్య, పురుషోత్తం, అమృత, మంజుల పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

చిట్యాల: కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి విమర్శించారు. చిట్యాలలో ఆదివారం నిర్వహించిన సీఐటీయూ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 8గంటల పని విధానాన్ని అమలుచేయకుండా పది గంటల పని విధానాన్ని పాలకపక్షాలు అమలు చేస్తున్నాయని ఆరోపించారు. కేంద్రప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన నాలుగు రకాల లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, పబ్బు స్వామి, ఏళ్ల మారయ్య, వడ్డెపల్లి శంకర్, సుక్క నర్సింహ, కల్లూరి నారాయణ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మోదీపై ముఖ్యమంత్రి వ్యాఖ్యలు గర్హనీయం



నల్లగొండలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు


నార్కట్‌పల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీని ఉద్దేశించి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నార్కట్‌పల్లిలోని నల్లగొండ క్రాస్ రోడ్డు వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. జూబ్లీహిల్స్ ప్రచారానికి వెళ్లిన ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నేతలను ప్రజలు ఆరు గ్యారెంటీలపై నిలదీయడంతో అసహనానికి గురైన రేవంత్‌రెడ్డి పీఎం మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం గర్హనీయమని పార్టీ మండల అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నడింపల్లి శ్రవణ్‌కుమార్, పాల్వాయి భాస్కర్‌రావు, మునుకుంట్ల గణేష్, నోముల నాగరాజు, బిల్లకంటి శ్రీకాంత్, అక్కెనపల్లి సత్తయ్య, తోటకూరి శివకుమార్, పాలకూరి రమేష్, బొల్లెద్దు రామలింగం, దినేశ్‌లు పాల్గొన్నారు.

నకిరేకల్: జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీజేపీపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదివారం నకిరేకల్‌లో బీజేపీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. బీజేపీపై రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వాఖ్యలను ప్రతీఒక్కరూ ఖండించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గర్రె మురళిమోహన్, మండల అధ్యక్షుడు బుడిగె సైదులు, యానాల శంకర్‌రెడ్డి, నాగరాజు, సైదులు, బోనగిరి వెంకటేశ్వర్లు, అంజయ్య, మహేష్‌రెడ్డి, నడికుడి సైదులు, సందుపట్ల వేణుమాధవ్, ఏర్పుల రేణుక, రింగు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రామగిరి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బీజేపీ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ నల్లగొండ జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజుయాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా, పట్టణ నాయకులు, యువమోర్చా నాయకులు పాల్గొన్నారు.

ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



నల్లగొండ

5 | సోమవారం 3 నవంబరు 2025


గరిష్ఠం 29.0 | కనిష్ఠం 21.4

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.60 (310.8498)	72,151	72,151
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.70 (4.12)	6,527.50	6,527.50
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	171.881 (41.0529)	69,213	1,11,512

చికెన్ ధరలు | లైవ్ : రూ.149 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260

పనుల పునరుద్ధరణకు సర్వే



- నేడు ఎస్ఎల్బీసీ ఎలెక్ట్రో మాగ్నెటిక్ హెలిబోర్న్ సర్వే ప్రారంభం
- నాగర్‌కర్నూల్ జిల్లా మన్నెవారిపల్లి నుంచి మొదలు
- పర్యవేక్షణకు సీఎం రేవంత్, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి

నల్లగొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ప్రతిష్ఠాత్మకంగా భావించే ఎస్ఎల్బీసీ సొరంగమార్గం పనుల పునరుద్ధరణ నిమిత్తం చేపడుతున్న ఎలెక్ట్రో మాగ్నెటిక్ హెలిబోర్న్ సర్వే నేటి నుంచి ప్రారంభం కానుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈ సర్వేను లాంఛనంగా ప్రారంభించనున్నారు. హైదరాబాద్ నుంచి సర్వే నిర్వహించే హెలికాప్టర్ తో పాటు ముఖ్యమంత్రి, మంత్రులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు మరో హెలికాప్టర్‌లో అవుట్‌లెట్ సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుని, ఈ హెలిబోర్న్ సర్వేను ప్రారంభించి పర్యవేక్షించనున్నారు.

2028జూన్‌లోగా పనులు పూర్తి చేసేలా..

శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి మన్నెవారిపల్లి వరకు 43.93 కిలోమీటర్ల సొరంగమార్గం పనులను 2007నుంచి చేపట్టగా, పలు అవాంతరాల నడుమ 2009 వరకు 34.13 కిలోమీటర్ల సొరంగం పూర్తయింది. 2009 వరదల సమయంలో ఇన్‌లెట్ వైపు పనులకు వరదనీరు, శకలాలు కూలడం వంటి ఆటంకాలతో పనులను ఆటంకం కలిగితే, ఔట్ లెట్ వైపు టీబీఎం యంత్రంలో బేరింగ్ పగిలిపోయి పనులు నిలిచాయి. అప్పటినుంచి ఆగిన పనులను తిరిగి ఈ ఏడాది ఫిబ్రవరి 22వ తేదీన పునఃప్రారంభించగా, మర్నాడు 23వ తేదీన ఇన్‌లెట్ వైపు పనులు జరిగే చోట కొండచరియలు విరిగిపడి ప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో ఎనిమిది మంది చనిపోగా, పనులు ఆగిపోయాయి. నిపుణుల కమిటీల నివేదికల అనంతరం ఇక్కడ బ్యాలెన్స్ సొరంగమార్గం పనులను అత్యాధునిక సాంకేతిక విధానం అవలంభించి వేగవంతంగా 2028 జూన్‌లోగా పూర్తి చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా పనులకు ఉపయోగించే సాంకేతికత నిమిత్తం నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సూచనలు తీసుకున్నారు. ఈ సంస్థ సూచనలతో పాటు రక్షణశాఖలో పనిచేసిన మాజీ ఈఎన్సీ లెఫ్టినెంట్ జనరల్ హరిపాల్‌సింగ్‌ను ఈ సొరంగ పనుల పర్యవేక్షణ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక సలహాదారులుగా నియమించింది. ప్రఖ్యాత టన్నెల్ స్పెషలిస్ట్ పరీక్షిత్‌మెహ్రాను ఏడాది పాటు ప్రత్యేక అధికారిగా నియమించా రు. వీరి సూచనలు, నిపుణుల కమిటీ సిఫారసుల మేరకు ఇక్కడ పనులు నిర్వహించే నిమిత్తం ఎలెక్ట్రో మాగ్నెట్ హెలిబోర్న్ సర్వే చేపట్టాలని నిర్ణయించారు. ఈ సర్వే పనులను సోమవారం ప్రారంభించనున్నారు. ఈ సర్వేలో 200 మీటర్ల ఎత్తు నుంచి ప్రత్యేక విద్యుదాయస్కాంత కిరణాల ద్వారా భూగర్భంలో 1000 మీటర్ల లోతు వరకు భూమిలో ఉండే పొరలు, నిర్మాణాలు, జల ప్రవాహాలను గుర్తించనున్నారు. ఈ సొరంగం మార్గంలో మిగిలిన దాదాపు 10 కిలోమీటర్ల పనులు ఎక్కడ ఎలా నిర్వహించాలో నిర్ధారిస్తారు. ఆ సర్వే ఆధారంగా పనులు పునఃప్రారంభించి టీబీఎం బదులు డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ విధానంలో సొరంగం నిర్మిస్తారు...

- మిగతా 8వ పేజీలో...

పురపాలికల్లో ఆఖరి మజిలీకి ఇక్కట్లు తప్పడం లేదు. జిల్లాలో పలు మునిసిపల్ కేంద్రాల్లో చేపట్టిన వైకుంఠధామం నిర్మాణాలు నేటికీ పూర్తికాలేదు. దీంతో పట్టణ ప్రజలు దహన సంస్కారాలు నిర్వహించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
(మిర్యాలగూడ టౌన్, సాగర్, దేవరకొండ)

ఆఖరి మజిలీకి అవస్థలు

ఆంధ్రజ్యోతి విజిట్



మిర్యాలగూడలోని మహాప్రస్థానం

- శ్మశాన వాటికలు.. సమస్యల వేదికలు
- పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాని మహాప్రస్థానం
- బాధ్యత మోస్తున్న కాంట్రాక్టర్:
- ఇతర వాటికలదీ అదే పరిస్థితి

పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా అదనపు వాటికలను నిర్మించాల్సిన పాలకులు అందుబాటులో ఉన్న వాటినే అభివృద్ధి చేయడం లేదు. సుదీర్ఘకాలం అనంతరం అభివృద్ధి చేసిన మహాప్రస్థానానికి బిల్లులు చెల్లించి స్వాధీనం చేసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రణాళికాలేమి కారణంగా శ్మశానవాటికలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. మిర్యాలగూడ పట్టణంలోని షాబూనగర్ హిందూ శ్మశానవాటికను మహాప్రస్థానం పేరుతో అభివృద్ధి చేశారు. 2023లో రూ.5.05కోట్ల వ్యయంతో చేపట్టిన పనులు శరవేగంగా సాగాయి. ఆ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు వచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అప్పటికే 90శాతం పనులు పూర్తి కాగా, మహాప్రస్థానంలో ఎలక్ట్రికల్ క్రిమేషన్ యూనిట్, జనరేటర్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాల్సి ఉంది. అందుకు సుమారు రూ.55లక్షలతో అధికారులు ప్రతిపాదలను రూపొందించారు. అయితే అప్పటికే అంచనా వ్యయానికి అదనంగా రూ.70లక్షలు వెచ్చించింది కాంట్రాక్ట్ సంస్థ. సుమారు రూ.5.50కోట్ల బిల్లులు విడుదల కాకపోవడంతో మిగతా పనులు పూర్తికాలేదు.



మిర్యాలగూడ మహాప్రస్థానంలో అసంపూర్తిగా ఉన్న పనులు

కాంట్రాక్ట్ సంస్థ నిర్వహణలోనే మహాప్రస్థానం

అత్యాధునికంగా అభివృద్ధి చేసిన మహాప్రస్థానాన్ని మునిసిపాలిటీ స్వాధీనం చేసుకోవాల్సి ఉంది. అయితే నిధులు విడుదలకాకపోవడంతో కాంట్రాక్ట్ సంస్థనే నిర్వహణ బాధ్యత చూస్తోంది. శ్మశాన వాటికలో విధులు నిర్వహించే వాచ్‌మెన్, వర్కర్ల వేతనాల నుంచి మొక్కల పెంపకం వరకు, విద్యుత్ బిల్లుల చెల్లింపుతో కలిపి నెలకు సుమారుగా రూ.లక్ష వెచ్చించాల్సి వస్తోందని కాంట్రాక్టరు వాపోతున్నాడు.

ఇతర వాటికలకు మోక్షమెప్పుడో?

పట్టణంలోని హిందూ శ్మశాన వాటికలు షాబూనగర్(మహాప్రస్థానం), గాంధీనగర్(ఎస్సీ), బాపూజీనగర్, ఈదులగూడ(రాంనగర్‌బంధం)లో ఉండగా, వినోబానగర్‌లో క్రిస్టియన్ బరేల్ గ్రౌండ్, బంగారుగడ్డలో ముస్లింల ఖబరస్థాన్ ఉన్నాయి. అయితే ఈ శ్మశాన వాటికల్లో కనీస వసతులు లేవు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న వైకుంఠధామాలు పచ్చదనం, సకల వసతులతో పార్కులను తలపిస్తుండగా, పట్టణంలోని పలు శ్మశాన వాటికలు అభివృద్ధికి నోచుకోకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఇబ్బంది పడుతున్నారు.

కార్యరూపం దాల్చకపోవడానికి కారణాలెన్నో

శ్మశాన వాటికల అభివృద్ధికి అడ్డుపడే కారణాలెన్నో ఉన్నాయి. అందులో స్థల వివాదం ప్రధాన సమస్యగా ఉండగా, నిధుల కొరత ఆ తరువాతది. పట్టణంలోని బాపూజీనగర్ శ్మశాన

- మిగతా 8వ పేజీలో...

శ్మశాన వాటికలను అభివృద్ధి చేస్తున్నాం



నిధుల కొరత కారణంగానే వైకుంఠధామాల అభివృద్ధి, నిర్వహణ సాధ్యం కావడంలేదు. పట్టణ ప్రజల అవసరాలకు అనుగుణంగా శ్మశాన వాటికలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించడంతో పాటు నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతున్నాం. ఆధునిక హంగులతో అభివృద్ధి చేసిన హిందూ శ్మశాన వాటిక మహాప్రస్థానం కాంట్రాక్టరు నిర్వహణలోనే ఉన్న మాట వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. యూఐడీఎఫ్ నిధులతో ఈదులగూడ శ్మశాన వాటికను అభివృద్ధి చేయనున్నాం.

- గణవేణి శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ

యాదవజాతి ఐక్యతకు సదర్
సమ్మేళనం నిదర్శనం

- రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ సభ్యుడు డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు
- వైభవంగా సదర్ సమ్మేళనం
- సదర్‌ను తిలకించి పరవశించిన ప్రజలు



నల్లగొండ, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): యాదవ జాతి సమైక్యతకు సదర్ సమ్మేళనం నిదర్శనమని రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ సభ్యుడు వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. యాదవుల సదర్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో ఆదివారం రాత్రి నిర్వహించిన యాదవుల సదర్ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శ్రీకృష్ణుని చిత్రపటానికి పూజలు నిర్వహించి ఉత్సవాన్ని పారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవులు గోసంపదను పూజించే సంస్కృతిని కొనసాగిస్తున్నామని యావత్ జాతికి తెలియజేసేందుకే ప్రతీ సంవత్సరం వైభవంగా సదర్ సమ్మేళాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం యాదవుల సదర్ సమ్మేళనం పండుగను అధికారికంగా నిర్వహించడం హర్షనీయమని పేర్కొన్నారు. ఈ సదర్ పండుగ యాదవుల ఖదర్‌ను నిలబెడుతుందన్నారు. యాదవులంతా ఒకే తాటిపైకి వచ్చి ఐక్యతను చాటారన్నారు. అంతకుముందే పట్టణంలోని గాంధీనగర్ యాదవసంఘం భవనం, మర్రిగూడ రేణుకాఎల్లమ్మ దేవాలయం, పాతబస్తీ యాదవ సంఘం ఆవరణలో హర్యానా, హైదరాబాద్ నుంచి తీసుకొచ్చిన ఐదు దున్నరాజులను అలంకరించి పూజలు నిర్వహించి ఊరేగింపును ప్రారంభించారు. ఆ ప్రాంతాల నుంచి మొదలైన దున్నరాజుల ఊరేగింపు డప్పు వాయిద్యాల మధ్య, యువకుల నృత్యాలతో శోభాయమానంగా సాగింది. సాయంత్రం ఈ ఊరేగింపులో పద్మశ్రీ అవార్డు గెలుచుకున్న గోల్‌టూ భజరంగి, షేహెంష, కోహినూర్ దున్నరాజులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సత్యం, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మద్ది శ్రీనివాస్‌యాదవ్, చీర పంకజ్‌యాదవ్, గుండెబోయిన లింగయ్యయాదవ్, ఏడుకొండలు, పిల్లి రామరాజుయాదవ్, జీవీ.యాదవ్, అల్లి సుభాష్‌యాదవ్, చంద్రయ్య, బెల్లి నాగరాజు, గుండెబోయిన సురేష్, చల్లా కోటేష్, నాగరాజు, పాల్గొన్నారు.

చిరకాల స్వప్నం
సాకారమయ్యే

అమ్మాయిలు కప్పు గెలిచేశారు..



సూర్యాపేటటౌన్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆకాశమే హద్దు.. అవకాశాన్ని వదలొద్దు.. అనే నినాదాన్ని నిజం చేస్తూ మహిళా భారత క్రికెట్ జట్టు ప్రపంచ కప్‌ను గెలుచుకుంది. కోట్లాది భారతీయుల ఆకాంక్షను నెరవేరుస్తూ భారత మహిళా క్రికెటర్లు తామేంటో ప్రపంచానికి చాటిచెప్పారు. పురుషుల క్రికెట్‌కు ఏమాత్రం తీసిపోనివ్వకుండా ప్రపంచాన్ని తమ వైపు చూసేలా భారత మహిళా క్రికెటర్లు అద్భుత ప్రదర్శన చేశారు. మహిళా ప్రపంచకప్ ఫైనల్‌లోకి ముచ్చటగా మూడోసారి ప్రవేశించిన మన జట్టు దక్షిణాఫ్రికాపై గెలిచి ప్రపంచకప్‌ను గెలుచుకుంది. దేశ ప్రజల ఆకాంక్షలను, ఆశలను భుజాలపై ఎత్తుకున్న మహిళా క్రికెటర్లు విశ్వకప్‌ను గెలిచి ప్రజల ఆనందపు హద్దులు దాటించారు. 2005, 2017లో భారత జట్టు మహిళా ప్రపంచకప్ ఫైనల్‌కు చేరి కప్పు గెలవకుండానే వెనుదిరగగా, ప్రస్తుత హర్మన్‌ప్రీత్ సేన చిరకాల స్వప్నాన్ని నిజం చేస్తూ విశ్వకప్‌ను సగర్వంగా గెలుచుకుంది. అటు తొలిసారి ప్రపంచకప్ ఫైనల్‌కు చేరుకున్న దక్షిణాఫ్రికా మహిళ జట్టు తుది సమరంలో ఓటమిని చవిచూసింది.

చివరి పంచ్ మనదే..

ఉత్కంఠ పోరాటాలతో విజయాలు సాధిస్తూ ఫైనల్‌కు చేరిన మన మహిళా జట్టు దక్షిణాఫ్రికాపై గెలిచి చివరి పంచ్ కొట్టింది. ఈ గెలుపు సమష్టివిజయంగా చెప్పవచ్చు. ఆస్ట్రేలియా వంటి బలమైన జట్టుపై భారీ లక్ష్యన్ని జెమీ మారోడ్రిగ్స్ సెంచరీతో గెలిపించిన విధానం ఎప్పటికీ గుర్తుండిపోతుంది. భవిష్యత్‌లో మహిళలు క్రికెట్‌పై ఆసక్తి పెంచుకునేలా విశ్వకప్‌ను స్ఫూర్తిగా నిలవనుంది. జిల్లా ప్రజలు ఆదివారం మధ్యాహ్నం నుంచే టీవీలకు అతుక్కుపోయారు. ముఖ్యంగా మహిళలు, యువతులు మహిళా క్రికెట్ జట్టుకు మద్దతు ఇస్తూ టీవీల్లో మ్యాచ్‌ను వీక్షించారు. చివరికి జట్టు కప్పును అందుకున్న క్షణంలో తామే గెలిచాం అనే విధంగా మహిళలు, దేశమంతా ఒక్కటైంది.


గందరగోళం

- ఎంజీయూలో మెస్‌ల నిర్వహణ అస్తవ్యస్తం
- విద్యార్థి సంఘాల మధ్య ఆధిపత్య పోరు
- పలుమార్లు గొడవలకు కారణమవుతున్న వైనం
- పంపకాలపై సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆడియోలు
- విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నా నాణ్యతపై సర్వత్రా చర్చ



నల్లగొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ యూనివర్సిటీలో నిరంతరం ఏదో ఒక సమస్య రాజుకుంటూనే ఉంది. యూనివర్సిటీలో మెస్ నిర్వహణ అనేది గందరగోళానికి దారితీస్తుంది. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించుకునేందుకు ప్రభుత్వం, యూనివర్సిటీ అధికారుల నుంచి ఎప్పటి నుంచో అనుమతులు ఉన్నాయి. మెస్ నిర్వాహకులు విద్యార్థుల అభిప్రాయాలు, ఫిర్యాదులు అవసరానికి అనుగుణంగా కార్యకలాపాలను మెరుగుపరచడం లేదు. దీంతో మెస్‌లో నాణ్యత, పరిశుభ్రతను పర్యవేక్షించడం, ధరలు నిర్ణయించడంలో విద్యార్థులు, ఆయా సంఘాలు పెద్దగా శ్రద్ధ చూపించడం లేదు. దీంతో యూనివర్సిటీ విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యూనివర్సిటీలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చి విద్యనభ్యసిస్తున్న విద్యార్థిని, విద్యార్థులు హాస్టళ్లలో ఉంటున్నారు. తోటి విద్యార్థులు మెస్ నిర్వహిస్తున్నప్పుడు లాభాపేక్ష చూసుకోకుండా నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నా ఆలోచనకు రావడం లేదని హాస్టల్ విద్యార్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 800మందికి పైగా విద్యార్థులు హాస్టల్‌లో ఉంటూ మెస్‌లోనే అల్పాహారంతో పాటు భోజనం చేస్తుంటారు. మెస్‌లలో విద్యార్థుల ఇబ్బందులను యూనివర్సిటీ అధికారులు పర్యవేక్షించి ఉంటే ఈ సమస్యలు వచ్చి ఉండేవి కావని పలువురు చర్చించుకుంటున్నారు. మూడు నాలుగు నెలల క్రితం ఎంజీయూలో విద్యార్థినుల హాస్టల్‌లో గొడ్డుకారం విషయం గొడవకు దారి తీసిన విషయం తెలిసిందే. విద్యార్థినులకు నాణ్యమైన ఆహారంతో పాటు కూరగాయలు, నాన్‌వెజ్ వంటివి నిబంధనల మేరకు వడ్డించాల్సి ఉంది. కానీ నిబంధనలకు విరుద్ధంగా గొడ్డుకారం పెట్టారన్న ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. విద్యార్థినులు నిర్వాహకులను నిలదీయడంతో పాటు ఆందోళన కూడా చేపట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కూడా విద్యార్థి సంఘాల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతూనే ఉంది. రెండు రోజుల క్రితం కూడా ఎంజీయూలో వివిధ సమస్యలపై విద్యార్థులు ఆందోళనకు దిగారు. అయితే నిరంతరం ఏదో ఒక సమస్య గురించి యూనివర్సిటీ ఆవరణలో ఆందోళన చేపడుతున్నారు. యూనివర్సిటీలో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. యూనివర్సిటీలో సౌకర్యాల కొరతపై నిరసన వ్యక్తం చేశారు. తాజాగా యూనివర్సిటీలో మెస్ నిర్వహణకు సంబంధించి పంపకాల విషయంలో జరుగుతున్న చర్చకు సంబంధించి సోషల్ మీడియాలో ఆడియోలు వైరల్ అవుతున్నాయి. ఇకపోతే బియ్యం సరఫరాతో పాటు కూరగాయలు, ఇతర నిత్యావసర సరుకుల పంపిణీ విషయం కూడా వివాదాస్పదంగా మారుతుంది. తమకు అనుకూలమైన వ్యక్తుల నుంచి బియ్యం కొనుగోలు చేస్తున్నా ఆ బియ్యం నాణ్యత లేకున్నా మెస్ నిర్వాహకులు ప్రశ్నించకపోవడం ఏమిటని హాస్టల్ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూనివర్సిటీ అధికారుల దృష్టికి తీసుకపోవడానికి హాస్టల్ విద్యార్థులతో పాటు కొన్ని విద్యార్థి సంఘాల నాయకులు నిర్ణయించుకున్నట్లు సమాచారం. మెస్ నిర్వహణలో మార్పు తీసుకరాకపోతే రాష్ట్ర స్థాయి అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నా ఆలోచనకు వచ్చారు.

ఎత్తిపోతలు నత్తనడకన



- మూడేళ్లయినా ముందుకు సాగని పనులు
- వర్షాలతో నిర్మాణ ప్రాంతంలో నిండిన నీరు
- నిలిచిన ఎత్తిపోతల పథకాల పనులు

సాగర్ ఎడమకాల్వ ఆయకట్టు పరిధిలోని చివరి భూములకు నీరందించేందుకు ప్రారంభించిన నాలుగు ఎత్తిపోతల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతోనే పనులు మందకొడిగా కొనసాగుతున్నాయని అధికారులు చెబుతుండగా, బిల్లులు సకాలంలో మంజూరు కాకపోవడం వల్లేనని తెలుస్తోంది.

- (ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ)

7

జనగణన సక్రమంగా జరగాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



తిప్పర్తి మండల రైతు వేదికలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

తిప్పర్తి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జనగణన కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఆదివారం తిప్పర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 2027 జనాభా లెక్కల సేకరణలో భాగంగా రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో ముందస్తు జనగణన కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా నిర్వహిస్తోందన్నారు. పట్టణ ప్రాంతామైన జీహెచ్ఎంసీ, గ్రామీణ ప్రాంతమైన తిప్పర్తి మండలం, గిరిజన ప్రాంతమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ముందస్తు జనగణన కొనసాగుతోందన్నారు. తిప్పర్తి మండలంలోని మామిడాల, ఇండ్లూరు, సర్వారం, తిప్పర్తి, జంగారెడ్డిగూడెం గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టుగా గణన కొనసాగుతుందన్నారు. అందుకు 35మంది ఎన్యుమరేటర్లు, ఆరుగురు సూపర్‌వైజర్లకు తిప్పర్తి రైతు వేదికలో మూడు రోజులపాటు శిక్షణ ఇస్తున్నామన్నారు. తొలిసారిగా డిజిటల్ పద్ధతిలో నిర్వహించే ఈ జనగణనలో ఎలాంటి తప్పులు దొర్లకుండా సమర్థంగా నిర్వహించాలన్నారు. ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు నిర్దేశించిన విధంగా ఎన్యుమరేటర్లు డిజిటల్ విధానంలో జనాభా లెక్కలను పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్, రాష్ట్ర గణాంకశాఖ జేడీ లాజరస్, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, తహసీల్దార్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వాహనాల రాకపోకలు



కోతకు గురైన హైవేను మరమ్మతులు చేపట్టడంతో యథావిధిగా వెళ్తున్న వాహనాలు

డిండి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన జాతీయ రహదారిపై భారీ వర్షాలకు కోతకు గురైన ప్రాంతాన్ని అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. దీంతో ఆదివారం వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షానికి డిండి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరిగి దిగువన నీటి ధాటికి శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారి కోతకు గురైంది. నాలుగు రోజులుగా హైవేపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. జాతీయరహదారి అధికారులు కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

కొనసాగుతున్న దామోదర హారతి

చింతపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంకటేశ్వరనగర్(మాల్)కు చెందిన ఆధ్యాత్మికవేత్త ప్రొద్దుటూరి దేవేందర్, లలిత దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం దామోదర హారతి కార్యక్రమం వైభవంగా కొనసాగింది. కార్తీకమాసాన్ని పురస్కరించుకొని ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వైద్యుల ప్రవీణ్ కుమార్‌శర్మ, మాజీ జడ్పీటీసీ చిన్నోళ్ల జంగమ్మ యాదయ్య, ఈశ్వర్, గంజి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కొండమల్లేపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావంతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కుంబాలపల్లి ఆనంద్ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని ఫకీర్‌పురం, రాంపురం, నేనావత్‌తండా, చిన్నంనేనిపల్లి గ్రామాల్లో పంట నష్టపోయిన ప్రాంతాలను పరిశీలించి రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30వేల నష్టపరిహారం చెల్లించాలన్నారు.

దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

● సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్



భూభారతి పోర్టల్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్

అడవిదేవులపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజలు చేసుకున్న దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీచేసి, పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణ్ అమిత్ మాట్లాడుతూ భూభారతి, సాదాబైనామా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అధికారులు సమయ పాలన తప్పనిసరిగా పాటించాలని, విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాగ్యానాయక్, ఆర్ఐ శ్యామ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ సాయి, జూనియర్ అసిస్టెంట్ పాపమ్మ, జీపీవోలు అంజయ్య, మహ్మద్‌అలీ, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలు నిర్వహించాలి

● సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లేష్

దామరచర్ల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కార్మికులు సమరశీల పోరాటాలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం హరించి వేస్తుందని, 44 కార్మిక చట్టాలను.. నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు మార్చే కుట్ర చేస్తోందని ఆరోపించారు. మండలంలోని కార్మికవర్గం ఐక్యమై హక్కుల సాధనకు ఉద్యమించాలన్నారు. అనంతరం సీఐటీయూ మండల నూతన కన్వీనర్‌గా మరోసారి బైరం దయానంద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మల్లు గౌతంరెడ్డి, వినోద్‌నాయక్, జహీర్, ఎర్రనాయక్, కోటిరెడ్డి, పాపానాయక్, మోహిద్దిన్, బాలు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

మాడ్గులపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుందని కాంగ్రెస్ మండలనేత కల్లు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఇందుగుల గ్రామంలో తిప్పర్తి పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి మద్దతు ధర పొందాలని, రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కాంటాలు వేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మునుగోటి యాదగిరి, నాగరాజుగౌడ్, పందిరి సతీష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సాయిమందిరంలో ఏకాదశి పూజలు

మిర్యాలగూడ టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హనుమాన్‌పేట సాయిమందిరంలో ఆదివారం ఏకాదశి పర్వదిన పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గోవింద్ పాండే మాట్లాడుతూ కార్తీకమాసం పరమ పవిత్రమైనదని, ఈ మాసంలో స్వామివారి వ్రతం జరిపితే సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు కలుగుతాయన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు గౌరు దయాకర్, ఎన్. పాపారావు, కీర్తి అశోక్, టంగుటూరి రాజారామ్, పెండ్యాల పద్మ, విజయ, గార్లపాటి శ్రీనివాస్, పంతులు శ్రీనివాస్, గంధం సైదులు తదితరులు పాల్గొన్నారు.

5న అయ్యప్ప మహా పడిపూజ

పెద్దవూర, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బట్టుగూడెం గ్రామంలో కొలువైన శ్రీహరిహరసుత అయ్యప్పస్వామి ఆలయంలో నిర్వహించే అయ్యప్ప మహా పడిపూజను జయప్రదం చేయాలని పూజ నిర్వాహకులు కూన్‌రెడ్డి గోవింద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆలయంలో మహా పడిపూజ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడుతూ రామారావు, శాంతి, రాజేష్ గురుస్వాములతో పడిపూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయ ప్రతిష్ఠ నుంచి తొమ్మిదేళ్లుగా ప్రతీ సంవత్సరం అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పూజారి సూరిభట్ల అనంతశర్మ, స్వాములు గాలి సైదిరెడ్డి, కత్తి ప్రభాకర్‌రెడ్డి, ముత్యాల్‌రెడ్డి, కాసర్ల శంకర్, కూన్‌రెడ్డి సత్యనారాయణరెడ్డి, నక్కల రామాంజిరెడ్డి, విజేందర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పనుల పునరుద్ధరణకు సర్వే

(5వపేజీ తరువాయి)

ఈ పనులన్నింటినీ 2028 జూన్‌లోగా పూర్తి చేయాలని ప్రాథమికంగా నీటి పారుదల శాఖ ఇంజనీర్లకు రాష్ట్ర ప్రభుత్వం డెడ్‌లైన్ విధించింది. సోమవారం ప్రారంభించే సర్వే సందర్భంగా ప్రాజెక్టు పనుల గురించి ఇరిగేషన్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చే అవకాశం ఉంది. ఈ కార్యక్రమానికి నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాలునాయక్, రాజగోపాల్‌రెడ్డి, వంశీకృష్ణ, జైవీర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, వేముల వీరేశం, ఎమ్మెల్సీలు శంకర్ నాయక్, నెల్లికంటి సత్యం హాజరవుతారని ఇరిగేషన్ అధికారుల పేర్కొన్నారు.

పత్తి రైతుల నిరీక్షణ

● సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం ఎప్పుడో?

గుర్రంపోడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోలు కేంద్రం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆరుగాలం కష్టించి సాగు చేసిన పత్తిని అడ్డికి పావుశేరు లెక్కన విక్రయించాల్సిన దుస్థితి నెలకొంది. గుర్రంపోడు మండలంలోని కొప్పోలు గ్రామంలో పత్తి మిల్లు ఉన్నా సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయలేదు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. సాగర్ నియోజకవర్గంలో గుర్రంపోడు మండలం కొప్పోలులో పత్తి మిల్లు ఒక్కటే ఉంది. నెల రోజులనుంచి రైతులు వ్యాపారులకు తక్కువ ధరకే పత్తిని విక్రయిస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. వ్యాపారులు మాత్రం రూ.5,300 నుంచి రూ.6,000కే పత్తిని కొనుగోలు చేస్తున్నారు. సీసీఐ పత్తికి మద్దతు ధర రూ.8110 ఉండగా, దళారులకు తక్కువ ధరకే విక్రయించి రైతులు భారీగా నష్టపోతున్నారు. కొప్పోలులో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని మాజీ వైస్ ఎంపీపీ వడ్డెగోని యాదగిరి గౌడ్ ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



పిట్టలగూడెంలో రైతులనుంచి ఇంటి వద్దే పత్తిని కొనుగోలు చేస్తున్న దళారులు

సమస్యల పరిష్కారానికి కృషి

● ఎల్ఐసీ ఏజెంట్ల జనరల్ సెక్రటరీ మార్కండేయులు



సమావేశంలో మాట్లాడుతున్న మార్కండేయులు

నాగార్జునసాగర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆల్ ఇండియా ఎల్ఐసీ ఏజెంట్ల జనరల్ సెక్రటరీ మార్కండేయులు అన్నారు. ఆదివారం నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ప్రాజెక్టు హౌస్‌లో మచిలీపట్నం డివిజన్ అధ్యక్షుడు నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ల ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మచిలీపట్నం డివిజన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెంట్లకు కమీషన్ తగ్గించారని, దీనిపై పోరాటం చేస్తామన్నారు. బ్రాంచీలలో సిబ్బంది కొరతతో ఏజెంట్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏజెంట్లకు గ్రాట్యూటీ పెంచాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ పెంచాలన్నారు. డివిజన్ అధ్యక్షుడు నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ ఏజెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలపై యూనియన్ తరఫున నిరంతరం పోరాటం చేస్తామన్నారు. సంస్థకు లాభాలు తెచ్చిపెట్టే ఏజెంట్లకు కమీషన్ తగ్గించడం ఏమిటన్నారు. కార్యక్రమంలో డివిజన్ వైస్ ప్రెసిడెంట్ నాగేశ్వర్‌రావు, జోనల్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, డివిజన్ జనరల్ సెక్రటరీ రవీంద్రరెడ్డి, కోశాధికారి జగన్నాథం, రఘు, రామచందర్‌రావు, మారుతి, గుంటూరు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాష్, మునీశ్వర్‌రావు, మచిలీపట్నం డివిజన్ ఎల్ఐసీ ఏజెంట్లు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలతోనే లాభాలు

● జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కర్నాటి లింగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కర్నాటి లింగారెడ్డి

పెద్దవూర, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలైన బత్తాయి, నిమ్మపంటలతో అధిక లాభాలు పొందవచ్చని జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కర్నాటి లింగారెడ్డి అన్నారు. ఆదివారం పెద్దవూర మండలం ఊట్లపల్లిలో వంగాల కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన బత్తాయి రైతుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పెద్దవూర మండలంలో బత్తాయి తోటలు కొంతకాలంగా దెబ్బతింటున్నాయని, సరైన యాజమాన్య పద్ధతులు పాటించి, లాభదాయకంగా మార్చుకోవాలన్నారు. రైతులు ఎఫ్‌పీవోలుగా ఏర్పడడం వల్ల మార్కెట్‌లో పంటకు అధిక ధర, ప్రభుత్వం ద్వారా అధిక సహాయం పొందవచ్చన్నారు. ఉద్యాన శాస్త్రవేత్త ఆరిఫ్‌ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో నిమ్మ, బత్తాయి రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి, అధిక దిగుబడి సాధించాలన్నారు. ప్రభుత్వం తరఫున కోల్డ్ స్టోరేజీలు, మార్కెట్ సదుపాయాలు కల్పించాలని సమావేశంలో వక్తలు కోరారు. కార్యక్రమంలో హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, ఉద్యానశాఖ అధికారులు విద్యాసాగర్, రవినాయక్, రైతు నాయకులు లోకసాని పద్మారెడ్డి, గజ్జల లింగారెడ్డి, తుడిమ సుధాకరెడ్డి పాల్గొన్నారు.

హనుమాన్ గాయత్రి మహాయజ్ఞాన్ని విజయవంతం చేయాలి

గుర్రంపోడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని తేనేపల్లితండాలో ఈ నెల 9న హనుమాన్ గాయత్రి మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు హనుమాన్ శక్తి జాగరణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్త్య నాగరాజు, యాదగిరి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌క్లబ్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. హనుమాన్ గాయత్రి మహాయజ్ఞానికి ముఖ్య అతిథిగా సంగ్రాం మహరాజ్ గురూజీ, కేతావత్ జయరాం గురుస్వామి, మద్దిమడుగు పీఠాధిపతి, హనుమాన్ దీక్ష వ్యవస్థాపకులు రామలింగేశ్వరశర్మ, వీరయ్యశర్మ, వెలుగు యాదయ్య గురుస్వామి, వడ్త్య రంజ్యానాయక్ గురుస్వామి పాల్గొంటారని తెలిపారు. అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించబడుతాయని, మండలంలోని ప్రజాప్రతినిధులు, అయ్యప్ప, శివ, హనుమాన్, భవాని స్వాములందరు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కోళ్లఫాం నుంచి దుర్వాసన

● సమస్య పరిష్కరించాలని విద్యార్థి సంఘాల వినతి



విద్యార్థి సంఘాల నేతలతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు(ఫైల్)

దేవరకొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ మండలం పెంచికల్‌పహాడ్ ఆదర్శ గురుకుల పాఠశాల సమీపంలోని కోళ్ల ఫాం నుంచి దుర్వాసన వస్తోంది. దీంతో పాఠశాలలో చదివే విద్యార్థులతో పాటు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దేవరకొండ మండలం పెంచికల్‌పహాడ్ వద్ద మూడేళ్ల క్రితం కోళ్లఫాం ఏర్పాటు చేశారు. ఈ కోళ్లఫాం సమీపంలో ప్రభుత్వ ఆదర్శ గురుకుల పాఠశాల, కస్తూర్బా గాంధీ పాఠశాలలు ఉన్నాయి. పెంచికల్‌పహాడ్ ఆదర్శ గురుకుల పాఠశాలలో 6 నుంచి 12 తరగతులకు గాను 540 మంది బాల, బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. గతేడాది సెప్టెంబరులో కోళ్లఫాం నుంచి దుర్వాసన వస్తుండడంతో, తాము ఆ వాసన భరించలేమని ఈ చదువులు తమకొద్దని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఇంటిబాట పట్టారు. దీంతో కోళ్లఫాం తొలగించాలని విద్యార్థి సంఘాల నేతలు ధర్నాలు, ఆందోళనలు చేపట్టారు. అధికారులు పాఠశాల వద్దకు చేరుకొని కోళ్లఫాం యజమానితో మాట్లాడి దుర్వాసన రాకుండా చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదు. ఈదురుగాలు వీచినప్పుడు పాఠశాలలోకి కోళ్ల దుర్వాసన వస్తుందని విద్యార్థులతోపాటు విద్యార్థిసంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. పెంచికల్‌పహాడ్‌లో చుట్టూ పంట పొలాల మధ్య కోళ్లఫాం ఏర్పాటు చేయడంతో చనిపోయిన కోళ్ల కళేబరాలను అక్కడే వేయడంతో దుర్వాసన వస్తుందని అధికారులకు తెలిపినా పట్టించుకోవడంలేదని పరిసర ప్రాంతాల రైతులు బత్తుల ఇద్దయ్య, గిరి, తాడూరి నర్సయ్య ఆరోపిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలతోపాటు పొలాల మధ్య కోళ్ల ఫాంను తొలగించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థులతోపాటు విద్యార్థి సంఘాల నేతలు, రైతులు అధికారులను కోరుతున్నారు. కోళ్లఫాం తొలగించాలని పలు పర్యాయాలు పంచాయతీ కార్యదర్శికి విన్నవించినట్లు రైతులు తెలిపారు. కాగా కోళ్లఫాం నుంచి అప్పుడప్పుడు దుర్వాసన వస్తుందని, విషయాన్ని కలెక్టర్‌తోపాటు డీఈవోకు విన్నవించినట్లు మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ ఆశీర్వాదం తెలిపారు.

కోళ్లఫాం తొలగించాలి



మోడల్‌స్కూల్, కస్తూర్బా పాఠశాల సమీపంలోనే కోళ్లఫాం ఉండడంతో విద్యార్థులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. గతంలోనే ఆందోళన చేసినప్పుడు ఫాం తొలగిస్తామని చెప్పారు. కాని యథావిధిగా కొనసాగుతుంది. వర్షాలు కురిసినప్పుడు, ఈదురుగాలులు వీసినప్పుడు గాలికి దుర్వాసన ఆదర్శ పాఠశాల వరకు వస్తుంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

బుడిగె వెంకటేష్, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం



పెంచికల్‌పహాడ్‌లో పాఠశాలల సమీపంలో ఉన్న కోళ్ల ఫారమ్ వల్ల ఇబ్బందులు పడుతున్నారని సమాచారం ఉంది. విచారణ జరిపి కోళ్ల ఫారమ్ యజమానులకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటాం. విద్యార్థులకు, రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపడుతాం.

మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్, దేవరకొండ

అంతిమ సంస్కారానికి అష్టకష్టాలు

● నీటికోసం ట్యాంకర్లు, దుస్తులు మార్చుకోవడానికి చెట్లను ఆశ్రయించాల్సిందే




దేవరకొండ గాజీనగర్‌రోడ్డులో కంపచెట్ల నడుమ శ్మశానవాటిక, నందికొండలో నిర్మాణ దశలో శ్మశానవాటిక

దేవరకొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మునిసిపాలిటీలో శ్మశానవాటికల్లో సౌకర్యాలు లేకపోవడంతో దహన సంస్కారాల నిర్వహణకు ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. పట్టణంలోని గాజీనగర్‌రోడ్డులో బెలవానికుంట, ముస్లింల శ్మశాన వాటిక, ముత్యాలమ్మ బజార్, అంజయ్య కాలనీ, పేట చెరువు, వడ్డెరకాలనీల్లో శ్మశానవాటికలు ఉన్నాయి. నిధులు లేకపోవడం, కంపచెట్లు పెరగడంతో దహన సంస్కారాలు నిర్వహించేందుకు వచ్చేవారు ఇబ్బందులుపడుతున్నారు. 2019లో శ్మశానవాటికలకు మరమ్మతులు, సౌకర్యాలకోసం నిధులు కేటాయించగా, దీంతో ప్రహరీల నిర్మాణం, బర్నింగ్ షెడ్లు, బోర్లువేసి నీటి సౌకర్యం కల్పించారు. అప్పటి నుంచి నిధుల కెటాయింపులేదు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

ఎవరైనా మృతి చెందితే మునిసిపల్ అధికారులకు ఫోన్ చేస్తే స్నానాల కోసం నీటిట్యాంకర్ పంపడంతోపాటు వైకుంఠరథం ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి శ్మశానవాటికకు ఒకరిని మునిసిపల్ అధికారులు నియమించాల్సి ఉన్నా సిబ్బంది కొరత ఉందని నియమించడం లేదు. గాజీనగర్‌రోడ్డు, ముత్యాలమ్మబజార్ శ్మశానవాటికల్లో విద్యుత్ లైట్లు లేకపోవడంతో రాత్రి అయితే ఇబ్బందులుపడాల్సి వస్తోంది. హిందూ, ముస్లింలకు వేర్వేరుగా శ్మశానవాటికలు ఉన్నాయి. కానీ స్మశానవాటికలకు బర్నింగ్ షెడ్లు, స్నానాల కోసం బోర్లు, నీటి సౌకర్యం, దుస్తులు మార్చుకునేందుకు గదుల ఏర్పాటు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నందికొండలో శ్మశాన వాటికే లేదు

నాగార్జునసాగర్: నందికొండ(నాగార్జునసాగర్) మునిసిపాలిటీ పరిస్థితి పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా ఉంది. హిందూ, ముస్లిం, క్రైస్తవ.. ఏ మతం వారైనా చనిపోతే రోడ్డువెంటనే దహన సంస్కారాలు నిర్వహించాల్సిన దుస్థితి. మునిసిపాలిటీ కాకముందు హిల్‌కాలనీ, పైలాన్ కాలనీల్లో నదీ ఒడ్డున రోడ్డు పక్కన ఆయా కులాలవారు వేర్వేరుగా శ్మశాన వాటికలు ఏర్పాటుచేసుకున్నారు. ప్రస్తుతం ఎవరైనా చనిపోతే అక్కడే దహన సంస్కారాలు నిర్వహించాల్సి వస్తోంది. నందికొండ మునిసిపాలిటీ ఏర్పాటైన తర్వాత రెండేళ్ల క్రితం పైలాన్ కాలనీకి వెళ్లే దారిలో రూ.కోటితో శ్మశాన వాటిక పనులు ప్రారంభించారు. కానీ నేటి వరకు ఆ పనులు పూర్తి కాలేదు. కేవలం అక్కడ రెండు గదులు, దహనసంస్కారాలు నిర్వహించే వేదిక తప్ప మిగతా పనులు పూర్తికాలేదు. దహన సంస్కారాల అనంతరం స్నానం చేయాలంటే నదికి వెళ్లాల్సిందే. అక్కడ మహిళలు దుస్తులు మార్చుకోవాలంటే చెట్ల చాటుకు వెళ్లాల్సిన దుస్థితి. ఈ విషయంపై మునిసిపల్ కమిషనర్ వేణును వివరణ కోరడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

ఆఖరి మజిలీకి అవస్థలు

(5వపేజీ తరువాయి)

వాటిక స్థలం ఆక్రమణలకు గురైందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికే సదరు స్థలంపై వివాదాలు, కోర్టు కేసులున్నట్టు స్థానికులు చెబుతున్నారు. గాంధీనగర్‌లోని శ్మశానవాటిక ప్రహరీ స్థలం వివాదంలో ఉండగా, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో సమస్యను పరిష్కరించగా, అభివృద్ధికి నిధుల కొరత అడ్డుపడుతోంది. రూ.20కోట్ల అంచనాలతో అనుమతి పొంది మూడేళ్ల క్రితం ఆరంభించిన పనులు నిధుల కొరతతో నిలిచిపోయాయి. కుటుంబ సభ్యులు, ఐనోళ్లను కడసారి చూసేందుకు వచ్చిన బంధుమిత్రులు ఆయా శ్మశాన వాటికల్లో అరకొర వసతుల నడుమ తూతూమంత్రంగా అంత్యక్రియలు జరిపే పరిస్థితి ఉంది. ప్రశాంత వాతావరణంలో దహన సంస్కారాలు, అంత్యక్రియలు నిర్వహించేలా శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

● నిధుల మంజూరు అరకొరగానే

పట్టణ మునిసిపాలిటీకి అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ రూ.16.70కోట్లు విడుదలైనప్పటికీ అందులో కేవలం రూ.కోటి మాత్రమే శ్మశానవాటికల అభివృద్ధికి కేటాయించినట్లు సమాచారం. అది కూడా ఆక్రమణలకు గురవుతున్న ఈదులగూడ శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికేనని మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఓ అధికారి తెలిపారు.

అన్నిరంగాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

● జూబ్లీహిల్స్‌లో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి ముమ్మర ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

హాలియా, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అన్నిరంగాల్లో అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా నాగార్జునసాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి ఆదివారం యూసుఫ్‌గూడ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో కలిసి గత పదేళ్లుగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని దోచుకున్న తీరును వివరిస్తూ రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపించాలని ముమ్మర ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అనుముల మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, చింతల చంద్రారెడ్డి, యడవల్లి నరేందర్‌రెడ్డి, మొయినుద్దీన్, పొదిల కృష్ణ, మదన్‌రెడ్డి, రావుల శ్రీనివాస్, గౌస్, రాజేందర్‌రెడ్డి, జగన్, మల్‌రెడ్డి భానుచందర్‌రెడ్డి, నకిరేకంటి సైదులు, అమరేందర్‌రెడ్డి, సింగారపు నగేష్, పోలే మధు, అంజి, విగ్నేష్, లింగారెడ్డి, రజిని తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపించాలని కోరుతూ ముమ్మరంగా ప్రచారం చేశారు. ఈ మేరకు ఇంటింటికి వెళ్తూ కరపత్రాలు పంచుతూ హస్తం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్‌కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపీటీసీ సదానందం, రహీం పాల్గొన్నారు.